

'కట్ట'పై టిప్పర్లకు బ్రేక్!



- కరకట్టపైకి ఇసుక లారీలు, టిప్పర్లు వస్తే కఠిన చర్యలు
- ఇసుక రీచ్ నిర్వాహకులకు అధికారుల హెచ్చరికలు

6లో

దైవ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..

పులిగడ్డలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న కారు

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- మృతులది గుంటూరు జిల్లా తెనాలిగా గుర్తింపు





మోహన్‌బాబు(ఫైల్)

అరుణ మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది, లారీని ఢీకొన్న కారు

వారసుడు పుట్టాడని ఆనందంగా దైవ దర్శనానికి బయలుదేరిన ఓ కుటుంబాన్ని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఉసురు తీసింది. మరో ఇద్దరిని తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలుజేసింది. ఈ హృదయ విదారక ఘటన అవనిగడ్డ మండలం పులిగడ్డ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది.

అవనిగడ్డ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఐటీసీ(ఇండియా టొబాకో కంపెనీ) ఉద్యోగిగా పని చేస్తున్న గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతానికి చెందిన గిడుగు సందీప్‌కు రెండు నెలల క్రితం కుమారుడు పుట్టగా, మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భార్య, కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులతో కలసి ఆల్టో కారులో సోమవారం మోపిదేవికి బయలుదేరారు. పులిగడ్డ - పెనుమూడి వారధి, టోల్ గేట్ల నడుమ కాకినాడ నుంచి పామాయిల్ లోడుతో ఎదురుగా వస్తున్న లారీని కారు రాంగ్ రూట్‌లో వెళ్లి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ముందు సీటులో ఉన్న సందీప్ తండ్రి జి.ఆర్.మోహన్‌బాబు(60), వెనుక కూర్చున్న తల్లి అరుణ (55) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీటులో ఉన్న సందీప్ భార్య పల్లవి, కుమార్తె సాత్విక(5), తల్లి ఒడిలో ఉన్న షణ్ముఖ్(2 నెలలు), డ్రైవింగ్ సీటులో ఉన్న సందీప్ తీవ్రంగా మిగతా 6లో..

పాపం పసివారు





మృతులు సాత్విక, షణ్ముఖ్

రూ.250 కోట్ల పబ్లిక్ ట్రస్ట్ భూమి

గోవిందా..!

పటమట గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్ట్ భూములకు రెక్కలు

- భూముల అన్యాక్రాంతం.. లీజుదారులు, ట్రస్టీల కుయుక్తులు
- భూములను కాపాడుకోలేని స్థితిలో దేవదాయ శాఖ
- ఏడాది కిందటే నివేదిక ఇచ్చినా చర్యలకు మీనమేషాలు
- లీజుదారుడి వారసుడొకరు రూ.100 కోట్లకు తనఖా
- వైసీపీ హయాంలో వత్తాసు పలికిన వెలంపల్లి, మల్లాది
- తాజాగా ట్రస్ట్ భూములను అమ్ముకోవటానికి ట్రస్టీ ప్రయత్నాలు
- ఆస్తులు అమ్మటం అసాధ్యమని తేల్చిన విచారణాధికారి



పటమటలోని గోవిందరాజులు ట్రస్ట్ భూములు

దేవదాయ శాఖ అధీనంలోని రూ.250 కోట్ల పైబడి విలువ చేసే పటమట గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్ట్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా ఈ భూములకు రెక్కలొచ్చాయి. పబ్లిక్ ట్రస్టుకు చెందిన భూములను రక్షించాల్సిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు.. కనీసం కిందిస్థాయి అధికారులు నివేదికలు ఇస్తున్నా పట్టించుకోవట్లేదు. లీజుదారుడి వారసులు డాక్యుమెంట్లు సృష్టించి రూ.100 కోట్ల మేర రుణం తీసుకోవడంతో పాటు ట్రస్టుకు చెందిన వారసులు ఈ భూములు తమవంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించినా అధికారుల్లో స్పందన లేకపోవడంతో అనేక అనుమానాలు కలుగుతున్నాయి. కొందరు అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపారన్న ఆరోపణలు వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గోవిందరాజు వంశీకులు వారి పూర్వీకుల నుంచి సంక్రమించిన పటమటలోని సర్వే నెంబర్ 91/2లోని 5.92 ఎకరాల స్థలాన్ని గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టుకు దానం చేశారు. దీనికి సంబంధించిన ధర్మ శాసనం లేకపోవటంతో 1947లో డాక్యుమెంట్ నెంబర్ 949 ద్వారా ఆ ట్రస్ట్ భూమికి సంబంధించి డీడ్ రిజిస్టర్ చేశారు. గోవింరాజుల వంశీకులైన గోవిందరాజు రాఘవరావు, గోవిందరాజు పూర్ణచంద్రరావు, గోవిందరాజు వెంకటేశ్వరరావు, గోవిందరాజు వెంకట దత్తాత్రేయశర్మ, గోవిందరాజు వెంకటేశ్వరరావులు మొత్తం ఐదుగురు రిజిస్టర్డ్ డీడ్ చేసిన వారిలో ఉన్నారు. అప్పటి డీడ్ రిజిస్టర్ ప్రకారం.. ఈ ఆస్తిని జాగ్రత్తగా కాపాడాలని, ఈ భూమి ద్వారా వచ్చే ఆదాయాన్ని నాలుగు భాగాలు చేయాలని నిర్దేశించారు. ఒక భాగాన్ని గోవిందరాజుల వంశీకుల్లో కానీ, మరెవరికైనా కానీ, ఆయుర్వేదం, మరేదైనా విద్యనభ్యసించే విద్యార్థికి ఖర్చు చేయాలని నిర్దేశించారు. రెండో భాగాన్ని దివ్యాంగులకు, పేదలకు అన్నదానం నిర్వహించటానికి ఖర్చు పెట్టాలని నిర్దేశించారు. మూడో భాగాన్ని వారి సొంతంగా కానీ, ఇతరుల ద్రవ్యంతో కానీ శివాలయం మిగతా 6లో..

లీజుదారుడి వారసుల రూ.100 కోట్ల రుణం

ట్రస్టుకు సంబంధించిన భూముల్లోని ఓ లీజుదారుడు అనారోగ్య సమస్యల కారణంగా మృతిచెందారు. ఈ క్రమంలో ఆ లీజుదారుడి వారసుడు ఈ భూమి పేరుతో వేరే డాక్యుమెంట్లు సృష్టించి ఓ జాతీయ బ్యాంకులో రూ.100 కోట్ల రుణం తీసుకున్నట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణులు వీరికి అండగా నిలవటంతో ఈ వ్యవహారం మరుగున పడింది. ఆ తర్వాత బ్యాంకుకు డీఫాల్టర్ కావటంతో ఆ బ్యాంకు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం వడ్డీతో కలిపి డీఫాల్టర్ అయిన వ్యక్తి రూ.200 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. ఈ ల్యాండ్ పబ్లిక్ ట్రస్టుకు సంబంధించినదని తెలుసో, తెలియకో కానీ, ఇప్పటివరకు దేవదాయ శాఖ అధికారులను బ్యాంక్ యాజమాన్యం సంప్రదించలేదని తెలుస్తోంది. ఈ భూమిని స్వాధీనం చేసుకుని ఆక్షన్ వేసే పరిస్థితి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఏటా వేసవిలో చేపట్టే పంట కాలువల నిర్వహణ పనులు ఈ ఏడాదైనా జరిగేనా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేసవి రానే వచ్చింది. పంట కాలువలకు ఫిబ్రవరిలోనే సాగునీటి విడుదల ఆగిపోయింది. ప్రస్తుతం పంట కాలువలు, డ్రెయిన్లలో తూడు, గుర్రపు డెక్క, నాచు, కిక్కిస పెరిగిపోయి పూడికతీత పనుల కోసం ఎదురు చూస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సాగు నీటి సంఘాల చొరవతో 722 పనులకు రూ.36.72 కోట్లతో అంచనాలు తయారు చేసి అధికారులు ప్రభుత్వానికి పంపారు. నేటి వరకు ఆమోదం రాలేదు. గతంలో డ్రెయినేజీల్లో పూడికతీత పనులు సక్రమంగా చేయకపోవడంతో పొలాల్లోని నీరు బయటకు పోక ఏటా లక్ష ఎకరాలకుపైగా పంటను రైతులు కోల్పోతున్నారు. ఈ వేసవిలోనైనా సకాలంలో కాలువలలో పూడికతీత పనులు చేయాలని రైతులు కోరుతున్నారు.



శివగంగ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క

అంచనాలతోనే సరి..

పంట కాలువల నిర్వహణ పనుల్లో జాప్యం

- ఈ ఏడాది 722 పనులకు రూ.36.72 కోట్లతో అంచనాలు
- ఏప్రిల్ వచ్చినా ఉన్నతాధికారుల నుంచి రాని ఆమోదం
- మరమ్మతులకు నోచుకోని అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో ఈ ఏడాది పంట కాలువలు, డ్రెయినేజీల్లో 722 ఓఅండ్ఎం పనులు చేసేందుకు రూ.36.72 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఈ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. ఆమోదం లభించిన తర్వాత టెండర్ల ప్రక్రియ, పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడానికి కనీసంగా నెలరోజులకు పైగా సమయం పడుతుంది. ఏప్రిల్‌లో ఈ పనులకు ఆమోదం తెలిపి టెండర్‌ల ప్రక్రియను పూర్తి చేస్తే మే, జూన్ నెలల్లో పనులను ఎలాంటి ఆటంకం లేకుండా చేయడానికి అవకాశం ఉంటుంది. దీంతో పాటు మేలో సముద్రం నుంచి కత్తెరపోట్లు ఉప్పునీటితో వస్తాయి. దీంతో డ్రెయినేజీలలో పెరిగిన గుర్రపు డెక్క, నాచు, తూడు తదితరాలు ఉప్పునీటి ప్రభావంతో చాలా మటుకు చనిపోతాయి. ఇలా చనిపోయిన తూడు, నాచు, గుర్రపు డెక్కలను యంత్రాల ద్వారా తొలగించి బయట పడవేస్తే కొంతమేర డ్రెయినేజీలలో పూడికతీత పనులు సులభతరమవుతాయి. అలా కాకుండా జూన్, జూలై వరకు వేచి ఉంటే పూడికతీత పనులకు ఆటంకం ఏర్పడుతుంది. వర్షాలు కురిసిన తర్వాత డ్రెయినేజీలలోకి పూర్తిస్థాయిలో తీపి నీరు చేరితే మళ్లీ గుర్రపు డెక్క, నాచు తదితరాలు జీవం పోసుకుంటాయి. దీంతో పూడికతీత కథ మళ్లీ మొదటికి వస్తుంది.

నీటి సంఘాల పర్యవేక్షణలో..

వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలను ఐదేళ్ల పాటు పూర్తిస్థాయిలో పక్కన పెట్టేశారు. దీంతో పంట కాలువలు, డ్రెయినేజీలలో ఎక్కడ పనులు చేయాలి, ఏ తరహా పనులు చేస్తే రైతులు పంటలు నష్టపోకుండా ఉంటారనే అంశంపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో గత ఐదు సంవత్సరాలుగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి పంట కోత కోసే దశ వరకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి సంఘాలు ఏర్పడ్డాయి. వీటి పర్యవేక్షణలో ఈ ఏడాది కృష్ణాడెల్టాలో సాగు నీటి కాలువలు, డ్రెయినేజీల మరమ్మతు పనులు పూర్తి స్థాయిలో చేయాలనే దృక్పథంతో పనులకు సంబంధించి అంచనాలు రూపొందించారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతులు కాలువల వెంట తిరిగి జిల్లాలో ఏయే ప్రాంతాల్లో ఏ తరహా పనులు చేయాలనే అంశంపై అంచనాలు రూపొందించారు. ఈ పనులన్నింటికీ అనుమతులు రాకున్నా కీలకమైన ప్రాంతాల్లో కాలువల నిర్వహణ పనులు చేసేందుకు నీటి పారుదలశాఖ అధికారులు ముందుకు వచ్చారు. డ్రెయినేజీలలో పూడిక తీయక పోవడంతో ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో భారీవర్షాలు కురిసిన సమయంలో డ్రెయినేజీలు పొంగిపోవడంతో రైతులు పంటలను కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ బాలాజీ ఈ ఏడాది జనవరిలోనే నీటి పారుదలశాఖ మిగతా 6లో..

ఐదేళ్లుగా ప్రతిపాదనల తయారీలోనే..

అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో ప్రధాన డ్రెయిన్‌లపై అవుట్ ఫాల్ స్లూయిస్‌గేట్లు ఏడు ఉన్నాయి. పొలాల నుంచి మురుగు నీరు సముద్రంలోకి వెళ్లేందుకు, సముద్రపు పోటు సమయంలో ఉప్పునీరు డ్రెయిన్‌ల ద్వారా పొలాల్లోకి చొచ్చుకు రాకుండా గతంలో వీటిని నిర్మించారు. పాలకాయతిప్ప, హంసలదీవి, నాలి, పాత ఉపకాలి, గుల్లలమోద, తదితర ప్రాంతాల్లోని అవుట్ ఫాల్ స్లూయిస్‌లు పూర్తిగా పాడైపోయాయి. వీటికి మరమ్మతులు చేయాలని కొన్నేళ్లుగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలో కూడా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఈ అవుట్ ఫాల్ స్లూయిస్‌లకు మరమ్మతులు చేయాలని కోరారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ అవుట్‌ఫాల్ స్లూయిస్‌లకు సంబంధించిన అంచనాలు తయారవుతూనే ఉన్నాయని అధికారులు చెప్పడం గమనార్హం.

విజిలెన్స్

పోలవరం మట్టి తవ్వకాలపై విచారణ

- విజయవాడ రూరల్, గన్నవరం మండలాల్లో పోలవరం కాలువపై భారీగా అక్రమ మైనింగ్
- వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలువ గట్లు మాయం
- కూటమి ప్రభుత్వం రాకతో రంగంలోకి విజిలెన్స్ బృందాలు
- ఎంత మట్టి తరలిపోయిందో లెక్క తేల్చేపనిలో బిజీ

పోలవరం కాలువ గట్టును అడ్డగోలుగా తవ్వేసిన ప్రాంతం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పోలవరం కాలువ మట్టి తవ్వకాలపై విజిలెన్స్ విచారణ ముమ్మరంగా జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం మట్టిని అడ్డగోలుగా తవ్వేశారు. విజయవాడ రూరల్ మండలం, గన్నవరం మండలాల పరిధిలో బరితెగించి మరీ అప్పటి వైసీపీ నాయకుల అనుయాయులు మట్టిని తవ్వుకుపోయారు. పోలవరం కాలువ కట్ట మీదకు భారీ ఎత్తున ప్రొక్లెయిన్లను తీసుకువచ్చి రాత్రి పగలు తేడా లేకుండా తవ్వేశారు. చూస్తుండగానే గుట్టలను కరిగించేశారు. పోలవరం కాలువ గట్టు వెంబడే ఉన్న రోడ్డుపైనే మట్టిని నింపుకున్న టిప్పర్లు బారులు తీరేవి అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రోజూ వెయ్యికి పైగా టిప్పర్లలో పోలవరం కాలువ గట్టు మట్టి తరలిపోయేది. అధికారం ఉందన్న అహంకారంతో వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా పోలవరం కాలువ మట్టిని తవ్వుకుపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పోలవరం మట్టి తరలింపు వ్యవహారాల లెక్క తేల్చేందుకు విజిలెన్స్‌ను రంగంలోకి దించింది. విజయవాడ రూరల్, గన్నవరం మండలాల పరిధిలో విజిలెన్స్ బృందాలు కొద్ది రోజులుగా పోలవరం కాలువ గట్టును ఎంత కొల్లగొట్టారన్నదానిపై కొలతలు తీసుకుంటూ, ఎంత మట్టి తరలిపోయిందో అంచనా వేస్తున్నాయి. ఇరిగేషన్ శాఖ మిగతా 6లో..



భవానీ ద్వీపం పునరుద్ధరణ!

- 'ఆపరేషన్ భవానీ ద్వీపం' పేరుతో చర్యలు
- భారీ చెట్లు, ఇసుక మేటల తొలగింపు

6లో

కనకదుర్గమ్మ



చైత్రమాస వసంత నవరాత్రుల్లో భాగంగా రెండో రోజైన సోమవారం దుర్గమ్మను కనకాంబరాలు, గులాబీలతో అర్చించారు.

6



మచిలీపట్నంలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

ఈద్ ముబారక్

రంజాన్ పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, పెడన, పామర్రు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు అధిక సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు.



ఉయ్యూరులో ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న చిన్నారులు



కరకట్ట రోడ్డుపై యథేచ్ఛగా తిరుగుతున్న టిప్పరు (ఫైల్‌ఫొటో)

'కట్ట'పై టిప్పర్లకు బ్రేక్!

- కరకట్టపైకి ఇసుక లారీలు, టిప్పర్లు వస్తే కఠిన చర్యలు
- ఇసుక రీచ్ నిర్వాహకులకు అధికారుల హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అవనిగడ్డ కరకట్టపై నుంచి రామలింగేశ్వరనగర్ వైపునకు వచ్చే టిప్పర్ల రద్దీ తగ్గింది. విజయవాడ ట్రాఫిక్ అధికారులు స్క్రూబ్రిడ్జి వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది గట్టి హెచ్చరికలు జారీ చేశారు. దీనితోపాటు టిప్పర్లు కరకట్ట నుంచి వస్తే సీజ్ చేస్తామని ఇసుక రీచ్‌ల నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. టిప్పర్లు, ట్రాక్టర్లు మితిమీరిన ఇసుక లోడ్‌తో కరకట్టపై నుంచి రాకపోకలు సాగించడంపై 'కట్ట కష్టం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై విజయవాడ ట్రాఫిక్ విభాగాధికారులు స్పందించారు. రొయ్యూరు, మద్దూరు, చోడవరం వైపు నుంచి వచ్చే ఇసుక టిప్పర్లను యనమలకుదురు అవతలి వైపు నుంచి దారి మళ్లించారు. ఇసుకతో వచ్చే లారీలు, ట్రాక్టర్లు అయినా, ఖాళీగా లోడ్ కోసం వెళ్లే వాహనాలు అయినా కరకట్ట మీదకు వస్తే కచ్చితంగా సీజ్ చేస్తామని రీచ్‌ల నిర్వాహకులకు హెచ్చరికలు జారీచేశారు. రీచ్‌లు ఉన్న రొయ్యూరు, మద్దూరు, చోడవరం ప్రాంతాలు పూర్తిగా కృష్ణాజిల్లా పరిధిలో ఉంటాయి. దీనితో అక్కడ పోలీసు అధికారులతో సంప్రదించి విజయవాడ వైపు కరకట్ట మీదుగా వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో 2,28,813 పెన్షన్లకు రూ.98.11 కోట్లు

- క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏప్రిల్ 1న ఎన్టీఆర్ భరోసా కింద 2,28,813 పెన్షన్లకు సుమారు రూ.98.11 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఇళ్ల వద్ద పెన్షన్ల పంపిణీ సజావుగా సాగేలా కృషిచేయాలన్నారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్‌డీఏ పీడీ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదల సేవలో స్ఫూర్తికి అనుగుణంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేలా దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఉదయం 7 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించి, ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. పంపిణీ సమయంలో ఇబ్బందిలేకుండా ఉండేందుకు పెన్షన్ రకాన్ని బట్టి నగదు మొత్తాన్ని బండిల్‌గా సిద్ధం చేసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఇళ్ల నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పెన్షన్ పంపిణీ చేయాల్సి వస్తే అందుకు తగిన కారణాన్ని ఎన్టీఆర్ భరోసా మొబైల్ యాప్‌లో నమోదు చేయాల్సి వుంటుందని, ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, పాఠశాల లేదా కళాశాలలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు, సిగ్నల్ సమస్య నరేగా పనిప్రాంతం తదితర కారణాలను నమోదు చేయాల్సి వుంటుందన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. టెలికాన్ఫరెన్సులో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తులసీరెడ్డి, లక్ష్మణరెడ్డి, వడ్డే, అక్కినేని వనజ

జనాభా ఆధారిత పునర్విభజనపై
అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఉద్ఘాటన

గవర్నర్‌పేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జనాభా ఆధారిత పునర్విభజన (డీ లిమిటేషన్) వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతోందని అఖిలపక్ష సమావేశంలో వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన సమావేశానికి రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి చర్చించాలని, తద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ సభ్యుల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదాన్ని నివారించగలమన్నారు. కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్ ఎన్.తులసీరెడ్డి మాట్లాడుతూ, జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతోందని ఆరోపించారు. ప్రస్తుతమున్న జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరగకూడదని, దీన్ని మనమంతా వ్యతిరేకించాలన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల కంటే యూపీ, బిహార్‌కు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులను కేటాయిస్తోందన్నారు. లోక్‌సభ సీట్లు కోల్పోతున్న రాష్ట్రాలకు రాజ్యసభ సీట్లు కేటాయించాలని కోరారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, అమెరికా సెనెట్‌లో 100 స్థానాలు ఉన్నాయని, జనాభా పరిమాణంతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రానికీ ఇద్దరు చొప్పున సెనెట్‌లను కేటాయించారని గుర్తుచేశారు. సీపీఐ కేంద్ర కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ, బీజేపీ.. దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతోందని, కేంద్ర నిధుల్లో 60 శాతానికిపైగా కేవలం ఏడు రాష్ట్రాలకే కేటాయిస్తోందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, జనచైతన్య వేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి, సామాజిక విశ్లేషకుడు కె.వసుంధర, కొలనుకొండ శివాజీ తదితరులు ప్రసంగించారు. అనంతరం నాలుగు ప్రధాన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

విజి'లెన్స్'

(5వ పేజీ తరువాయి)

అధికారులు గతంలో ఇచ్చిన అనుమతులు కాకుండా.. అనుమతులు లేకుండా సాగించిన తవ్వకాలపై విజిలెన్స్ బృందాలు దృష్టి సారించాయి. స్థానికంగా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులపై కూడా దృష్టి పెట్టాయి. స్థానిక గ్రామాల వారిని కూడా విచారిస్తూ ఎవరు తవ్వకాలు జరిపారు? ఎప్పుడు జరిపారు? వంటి వివరాలను తెలుసుకుంటున్నాయి. మరో వారం రోజుల్లో పోలవరం కాలువ గట్టుపై ఎంత మేర అక్రమ మైనింగ్ జరిగిందో విజిలెన్స్ అధికారులు లెక్కలు తేల్చనున్నారు.

శక్తిరూపిణీ.. నమోస్తుతే

- ఇంద్రకీలాద్రిపై వైభవంగా పుష్పార్చన


పుష్పార్చనకు పూలు తీసుకువెళుతున్న డిప్యూటీ ఈవో రత్నరాజు, అధికారులు, అర్చకులు, భక్తులు


దుర్గమ్మకు రెండోరోజున కనకాంబరాలు, గులాబీలతో పుష్పార్చన, పూజల్లో పాల్గొన్న భక్తులు



ఇంద్రకీలాద్రి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో చైత్ర మాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని రెండో రోజైన సోమవారం దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో పుష్పార్చన వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రాజగోపురం నుంచి డీఈవో రత్నరాజు, అర్చకస్వాములు, ఉద్యోగులు పూల గంపలను అమ్మవారి సన్నిధికి తీసుకుని వెళ్లారు. పూజా మండపం (నటరాజ స్వామి ఆలయ ప్రాంగణం)లో ఉదయం 9 గంటలకు పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. అర్చకస్వాములు అమ్మవారికి లలితా సహస్రనామాలతో పుష్పార్చనను వేదోక్తంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కనకాంబరాలు అంటే ప్రీతి. కనకాంబరాలతో పాటు అమ్మవారి శక్తి రూపం ఎర్రటి రంగు పూలను అర్చించటం జరుగుతుంది. ఈ క్రమంలో గులాబీలను అమ్మవారికి సమర్పించారు. కాగా అర్చకులు, ఉద్యోగులపై డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మవారికి పూజలు నిమిత్తం పూజా మండపం వద్దకు వెళ్లే సమయంలో అమ్మవారి దర్శనానికి సినీనటుడు పృథ్వీరాజ్ విచ్చేయగా డీఈవో ఆగి మాట్లాడారు. అర్చకులు, ఉద్యోగులు పూజా కార్యక్రమానికి సమయం అవుతుందని వేదిక వద్దకు వెళ్లడంపై తాను వచ్చే వరకు ఆగలేరా.. డీఈవో అంటే లెక్కలేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి : ఈవో

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఈవో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. చెప్పుల స్టాండ్, సెల్‌ఫోన్ కౌంటర్లలో పెద్దఎత్తున భక్తుల నుంచి ఫిర్యాదులు రావటంతో సోమవారం ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది భక్తుల నుంచి డబ్బులు వసూలు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెల్ ఫోన్ కౌంటర్ కాంట్రాక్టర్ తన సిబ్బందిని క్యూలైన్‌ల వద్ద ఏర్పాటు చేసి భక్తులను తనిఖీ చేయటమేమిటని ప్రశ్నించారు. భక్తులను తనిఖీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులను తనిఖీ చేసిన సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులను ఈవో ఆదేశించారు. అధికారులు ప్రతిరోజూ ఆలయంలో పర్యవేక్షించి భక్తులకు సౌకర్యాలు కల్పించి అమ్మవారి దర్శనం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ద్వీపంలో భారీ ఎత్తున చెట్లను కట్టర్లతో తొలగిస్తున్న సిబ్బంది

భవానీ ద్వీపానికి మోక్షం

- ముందుగా పునరుద్ధరణ పనులు.. తర్వాత అభివృద్ధికి చర్యలు
- భారీ చెట్లు, ఇసుక మేటల తొలగింపు


భవానీ ద్వీపంలో పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న ఏపీటీడీసీ అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భవానీ ద్వీపం పునరుద్ధరణ పనులు మొదలయ్యాయి. వరదల కారణంగా అతలాకుతలమైన ద్వీపాన్ని మరల అభివృద్ధి దిశగా నడిపించటానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. 'ఆపరేషన్ భవానీ ద్వీపం' పేరుతో భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్(బీఐటీసీ), ఏపీటీడీసీ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఏపీటీడీసీ ఎండీ నూకసాని బాలాజీ భవానీ ద్వీపాన్ని సందర్శించి జరుగుతున్న పనులను సమీక్షించారు. చేపట్టవలసిన అంశాలపై తగిన సూచనలు చేశారు. భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ ఈడీగా ఉమామహేశ్వరరావు తిరిగి రావటం వల్ల గతంలో ఇక్కడ చేపట్టిన పనులకు సంబంధించి పూర్తి అవగాహన ఉండటం కలిసొస్తోంది. వరదల కారణంగా కకావికలమైన భవానీ ద్వీపాన్ని ముందుగా పునరుద్ధరించి సాధారణ స్థితికి తీసుకువచ్చి ఆ తర్వాత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. ముందుగా ద్వీపం పునరుద్ధరణ పనులు చేపట్టారు. వరదలకు భారీగా కొట్టుకు వచ్చిన ఇసుక గుట్టల తొలగింపు పనులు చేపట్టారు. ఎకరాల విస్తీర్ణంలో మేట వేసుకుపోయిన ఇసుకను తొలగించటానికి పెద్ద ఎత్తున జేసీబీలను ఉపయోగిస్తున్నారు. ఇసుకను పూర్తిగా బయటకు తరలిస్తున్నారు. అలాగే చెట్లు పడి పాత్‌వేలన్నీ కూడా కనిపించకుండా పోయాయి. చెట్లు కూడా ఎకరాల విస్తీర్ణంలోనే ఉన్నాయి. దీంతో ట్రీ కట్టర్స్‌ను పిలిపించి ఆధునిక యంత్రాలతో పాత్‌వేల మీద ఉన్న చెట్లను తొలగించే పనులు చేపడుతున్నారు. ఒకటి, రెండు నెలల్లో పనులు పూర్తి చేసిన తర్వాత.. అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎంత భారీ వరద వచ్చినా భవానీ ఐల్యాండ్ దెబ్బతినకుండా ఉండేలా షైల్ షీటింగ్, ఫెన్సింగ్ స్టోన్ ఫార్మేషన్, రిటైనింగ్ వాల్ వంటి అంశాలకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తున్నారు.రీటెయినింగ్ వాల్ ఏర్పాటు చేయాలంటే బాగా ఖరీదైన వ్యవహారం కావటంతో షీట్ పైలింగ్ కానీ, ఫెన్సింగ్ స్టోన్ ఫార్మేషన్ వంటి విధానాలను అవలంబించాలని భావిస్తున్నారు. భవానీ ద్వీపంలో వినోదాత్మక ప్రాజెక్టులపై దృష్టి సారించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు.

రేపు ఉపాధ్యాయుల సమస్యలపై నిరసన : ఫ్యాప్టో

గవర్నర్‌పేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యలపై ఏప్రిల్ 2న విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, సెక్రటరీ జనరల్‌లు అలపాల సుందరయ్య, ఇంటి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసి, పీఆర్సీ కమిషనర్ నియామకం చేయాలని, ఈలోగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్న డిమాండ్‌లతో పాటు అపరిష్కృత సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలకు ఫ్యాప్టో పిలుపు నిచ్చినట్టు వెల్లడించారు.

నేడు సోషల్ పరీక్షకు ఏర్పాట్లు చేయండి

- డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి సోషల్ పరీక్ష రాసే విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా తాగునీటి ఏర్పాట్లు చేయాలని డీఈవో రామారావు తెలిపారు. ఎండలు ముదురుతున్న దృష్ట్యా మంగళవారం నిర్వహిస్తున్న పరీక్ష రాసే విద్యార్థులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించాలన్నారు. చివరి పరీక్ష రోజున పుస్తకాల కాగితాలు చించడం అలవాటై పోయిందని, ఈ అలవాటు మాన్పిస్తూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు అమలు చేయాలన్నారు.

ఎన్ఎస్‌పీ కాలువలో పడి ఉద్యోగి మృతి


నాగేంద్ర (ఫైల్)

విస్సన్నపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్‌పీ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చిలకమర్రి నాగేంద్ర (45) ఎన్ఎస్‌పీ కాలువలో పడి మృతి చెందాడు. ఆదివారం ఆఫీసుకని బయలుదేరిన భర్త సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడం, ఫోన్ పని చేయకపోవడంతో అనుమానంతో అతడి భార్య అనూష పోలీసులను సంప్రదించారు. పోలీసుల విచారణలో సోమవారం మద్దులపర్వ ఎన్ఎస్‌పీ లాకుల వద్ద నాగేంద్ర మృతదేహం గుర్తించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఏఎస్సై సక్రు నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో నటుడు శర్వానంద్

మోపిదేవి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సినీ నటుడు శర్వానంద్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో ఆయను సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు వారికి అందజేశారు.

దైవ దర్శనానికి వెళుతూ అనంతలోకాలకు..

(5వ పేజీ తరువాయి)

గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారుకు ఇరుక్కుపోయిన మోహన్‌బాబు, అరుణ మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన సాత్విక, సందీప్, పల్లవిలను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు సీటు వెనుక పసికందు

క్షతగాత్రులందరినీ ఆస్పత్రికి తరలించటం పూర్తయిందని భావించిన పోలీసులు ప్రమాద స్థలం నుంచి కారును వెనక్కి తీయగా, కారులో సీటు వెనుక పడిన రెండు నెలల పసికందు కనిపించింది. వెంటనే అప్రమత్తమైన అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి పసికందును తీసుకొచ్చారు. అయితే అప్పటికే ప్రమాదం జరిగి అరగంట కావడంతో పసికందును కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తీవ్రంగా గాయపడిన స్వాతికకు రెండు మార్లు వైద్యులు సీపీఆర్ చేశారు.


ఆసుపత్రిలో పసికందుకు చికిత్స చేస్తున్న వైద్యులు

అయినా పరిస్థితి విషమంగా ఉండటంతో బెలూన్ ద్వారా ఆక్సిజన్ అందిస్తూ మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే సాత్విక మృతి చెందింది. సందీప్ భార్య పల్లవి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను, కాలు, పక్కటెముకలకు తీవ్ర గాయాలైన సందీప్‌ను కూడా మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నా వాళ్లు ఎక్కడ?

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్ షాక్‌లోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపు తానెవరు, ఎక్కడి నుంచి వస్తుంది కూడా చెప్పలేకపోయిన సందీప్ కొద్దిసేపటి తర్వాత తాము గుంటూరు జిల్లా తెనాలి నుంచి వచ్చినట్లుగా పోలీసులకు తెలిపారు. నాకేమైంది.. ఇక్కడెందుకు ఉన్నాను.. నా వాళ్లు ఎక్కడ అంటూ సందీప్ పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీసులు, వైద్య సిబ్బంది తల్లిదండ్రులు, కుమార్తె, కుమారుడు మరణించారని సమాధానం చెప్పలేక కంటతడి పెట్టుకున్నారు. సందీప్ ఫోన్‌కు తెలిసిన వారి నుంచి ఫోన్ రావడంతో వారు తెనాలి చెంచుపేటకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వెంటనే వారి బంధువులను అవనిగడ్డ రావాల్సిందిగా సూచించారు. అవనిగడ్డ ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుమన్, డాక్టర్ నాగమణిలు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి మచిలీపట్నం తరలించారు. జి.ఆర్.మోహన్‌బాబు, అరుణ, షణుఖ్ మృతదేహాలను అవనిగడ్డ మార్చురీకి తరలించగా, మచిలీపట్నం వెళ్తూ మార్గమధ్యలో మృతి చెందిన సాత్విక మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

అంచనాలతోనే సరి..

(5వ పేజీ తరువాయి)

అధికారులతో సమీక్ష నిర్వహించి, కాలువల నిర్వహణ పనులకు సంబంధించిన అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు.

జిల్లాలో 6.79 లక్షల ఎకరాల్లో పంటల సాగు

కృష్ణాడెల్టాలో 13.08 లక్షల ఎకరాల్లో వరిసాగు జరగ్గా, తూర్పు కృష్ణా డెల్టాలో 6.79 లక్షల ఎకరాలకుపైగా వరిసాగు ఉంది. 378 తాగునీటి చెరువులు ఉన్నాయి. కేఈబీ, బందరు, రైవస్ కాలువ, రామరాజుపాలెం, బంటుమిల్లి కాలువల ద్వారా సాగునీటి విడుదల జరుగుతుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గత ఐదేళ్ల పాటు కనీసంగా పంట కాలువల నిర్వహణ పనులు చేయలేదు. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన సాగునీటి సంఘాల ద్వారా పంట కాలువలు, డ్రెయిన్‌లలో మరమ్మతు పనులు చేసేందుకు ఇప్పటికే అంచనాలు రూపొందించారు. గతంలో రూ.5లక్షల వరకు నామినేషన్ పద్ధతిన పనులు కేటాయించేవారు. ఈ ఏడాది రూ.10 లక్షలకు ఈ మొత్తాన్ని పెంచి నామినేషన్ పద్ధతిన సాగునీటి సంఘాలకు పనులు అప్పగించేందుకు ప్రభుత్వం సూచన ప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. గడచిన ఏడాది కాలువల నిర్వహణ పనులకు జిల్లాకు కేవలం రూ.26కోట్లను కేటాయించారు. సార్వత్రిక ఎన్నికలు జరగడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా కాలువల నిర్వహణ పనులకు ఆమోదం తెలపడానికి ఆగస్టు నెల వరకు వేచిచూడాల్సి వచ్చింది. ఈ నిధులతో కాలువల్లో పెరిగిపోయిన గుర్రపు డెక్క, తూడు, నాచులను తొలగించాలని మాత్రమే అంచనాలు రూపొందించారు. ఇతర మరమ్మతు పనులను చేయలేదు. కాలువలకు సాగునీటిని విడుదల చేసిన తర్వాత సెప్టెంబరు నెలలో వచ్చిన భారీ వర్షాలు, బుడమేరుకు సంభవించిన వరదల కారణంగా 50 వేల హెక్టార్లలో వరిపైరు నీటమునిగి చనిపోయింది.

గోవిందా..!

(5వ పేజీ తరువాయి)

నిర్మించాలని పేర్కొన్నారు. శివాలయం కట్టే వరకు యనమలకుదురు కొండపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామికి ఏటా కార్తీక, మాఘమాసాల్లో గోవిందరాజు వంశీకుల గోత్రాలతో రోజూ ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన చేయించాలని పేర్కొన్నారు. ఇక నాల్గో భాగాన్ని గో సంరక్షణ కోసం ఒక్క ఆవునైనా ఆ స్థలంలో ఉంచి పశుపోషణకు వినియోగించాలన్న నియమం పెట్టారు. కాలక్రమంలో ఈ సంస్థ దేవదాయ చట్టం 1966, సెక్షన్ 38 ప్రకారం రిజిస్టర్ అయింది. ట్రస్టీ ఆధీనంలో ఉండగానే ఈ భూమిని లీజుకిచ్చారు. తొలుత ఈ భూమిలో ఓ ఎకరాన్ని ఓ ప్రైవేట్ వ్యక్తికి సంవత్సరానికి రూ.500 చెల్లించే ప్రాతిపదికన లీజుకిచ్చారు. మరో ఎకరాన్ని ఆలయం నిర్మాణం కోసం వదిలారు. మిగిలిన 3.92 ఎకరాలను ఆంధ్రా ఆయిల్స్ అండ్ ఫెర్టిలైజర్స్, సురేంద్ర కాటన్ ఆయిల్ మిల్స్ వారికి ఏడాదికి రూ.3,800 లీజు ప్రాతిపదికన ఇచ్చారు.

విక్రయానికి ట్రస్టీ విశ్వప్రయత్నాలు

గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టీగా ఉంటున్న వారు కూడా 1.92 ఎకరాలను అమ్మటానికి నిర్ణయించుకున్నారు. దీనికోసం వారు విజయవాడ కోర్టులో కేసు వేశారు. ఆ భూమిని అమ్ముకోవటానికి ఆర్డర్ కూడా తెచ్చుకున్నారు. 1947లో గోవిందరాజుల వంశీయులు ఈ భూములను ధర్మ కార్యకలాపాలకే వినియోగించాలని నిర్దేశించారు. పైన చెప్పుకొన్నట్టుగా ఈ భూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా నాలుగు భాగాలుగా చేసి ఏం చేయాలన్న దానిపై స్పష్టత ఇచ్చారు. అప్పట్లో ఈ భూముల పరిరక్షణకు సంబంధించి ధర్మశాసనం లేకపోవటంతో గోవిందరాజుల వంశీకులంతా కలిసి రిజిస్టర్ డీడ్ రాశారు. ఇవన్నీ ఉన్నప్పటికీ ఏ ప్రాతిపదికన ట్రస్టీ భూములను అమ్ముకోవడానికి కోర్టుకు వెళ్లడం గమనార్హం.

ట్రస్టీ భూస్వామి కాలేడు : అసిస్టెంట్ కమిషనర్‌కు నివేదికలో ఈవో

గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు భూములకు సంబంధించి విచారణ చేపట్టిన మచిలీపట్నం శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం ఈవో... ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్‌కు నివేదికను అందించారు. దీనిప్రకారం పబ్లిక్ ట్రస్టుగా ఉన్న ఈ సంస్థ భూములను ఎప్పటికీ ప్రైవేట్ ట్రస్టుగా మార్చే అవకాశం లేదని స్పష్టతనిచ్చారు. పబ్లిక్ ట్రస్ట్ ఆస్తులకు సంబంధించి సీలింగ్ చట్టం వర్తింపుపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దేవదాయ చట్టం 30/87లోని సెక్షన్ 1, 2ను అనుసరించి గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు దేవదాయ చట్టం పరిధిలోకి వస్తుందన్నారు. విజయవాడ కోర్టులో ఆ భూమిని విక్రయించుకోవటానికి అనుమతి పొందటమనేది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు భిన్నమని వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంలో పలు హైకోర్టు తీర్పులను కూడా ఆయన ఉదహరించారు. పబ్లిక్ ట్రస్టుకు సంబంధించిన భూములను ప్రైవేట్ ట్రస్టుగా భావించడం తగదని, ట్రస్టీ ఎప్పటికీ భూస్వామి కాలేడని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు విరుద్ధంగా, ఏదో ఒక ఆర్డర్‌ను ఆధారంగా చేసుకుని పబ్లిక్ ట్రస్ట్ ఆస్తిని అమ్మడం అనేది క్రిమినల్ చర్యగా పేర్కొన్నారు. ట్రస్టీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా ట్రస్టీకి నోటీసులిచ్చి తాత్కాలికంగా తొలగించి, మరొకరిని నియమించాల్సిన అవసరం కూడా ఉందని సూచించారు. సంస్థకు జరిగిన నష్టాన్ని ట్రస్టీ నుంచి రాబట్టాలని కూడా ఆయన ఆ నివేదికలో విజ్ఞప్తి చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	162, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



గన్నవరంలో నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

గన్నవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఫ్యాప్టో నాయకులు మరీదు వరప్రసాద్, దేవరపల్లి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక హైస్కూల్‌లో ఫ్యాప్టో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పీఆర్సీ, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలన్నారు. బుధవారం మచిలీపట్నంలో జరిగే ధర్నాలో ఉపాధ్యాయులందరూ తరలి రావాలని కోరారు. రవిబాబు, రాజాబాబు, డి.శివప్రసాద్, బి.జ్ఞానానందం, జగతి, కృష్ణవేణి, సుజశ్రీ, రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

వక్ఫ్ భూములపై ఆందోళనొద్దు

● ముస్లింలకు అండగా కూటమి ప్రభుత్వం
● ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు భూముల విషయంలో ముస్లింలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వక్ఫ్ భూముల రక్షణకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలంలోని గోసాల, కంకిపాడు మండలంలోని పునాదిపాడు, ఈడుపుగల్లు, గొడవర్రు, కోమటికుంట లాకు గ్రామాలకు చెందిన ముస్లింలు కంకిపాడులో నిర్వహించిన ఈద్ నమాజ్‌లో ఆయన పాల్గొన్నారు. ముందుగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, వక్ఫ్‌బోర్డు ఆస్తులపై కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన అమెండ్మెంట్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పార్టీ పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఏ విధంగా ఉన్నా వక్ఫ్ బోర్డు ఆస్తులకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతి రేకంగా ముస్లింలు నల్ల రిబ్బన్లతో శాతియుతంగా రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద ప్రసాద్, షేక్ మాబు సుబాని, షేక్ బాజ, పఠాన్ కరీముల్లా, పఠాన్ సుబాని, షేక్ అమీర్, మొహమ్మద్ ఆరీఫ్, మొహ్మద్ బేగ్ పాల్గొన్నారు.



జంక్షన్‌లో ముస్లింల నిరసన

యనమలకుదురులో..

పెనమలూరు : పెనమలూరు, విజయవాడ తూర్పు నియోజకవర్గాల్లో నివసిస్తున్న ముస్లింలకు అవసరమైన సౌకర్యాలన్నీ కల్పిస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం యనమలకుదురులో పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ భూములను సెంటు కూడా వదిలిపెట్టకుండా కాపాడతామన్నారు. ఉయ్యూరు పెద్ద మసీదు అభివృద్ధికి సీఎం చంద్రబాబుతో మాట్లాడి రూ. 50 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గోసాలలో రూ. 5 కోట్ల వి లువైన భూమిని ఈద్గా నిర్మాణానికి కేటాయించామన్నారు. ఈడుపుగల్లులో మ సీదు అభివృద్ధికి రూ. 30లక్షలు మం జూరు చేయడం జరిగిందన్నారు. గంగూరులో మూడున్నర కోట్ల ప్రైవేటు భూ మిని ఉచితంగా ముస్లింల అవసరాలకు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు.



యనమలకుదురులో ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్ ప్రత్యేక ప్రార్థనలు

జంక్షన్‌లో ముస్లింల నిరసన

హనుమాన్‌జంక్షన్ : ముస్లిం వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు స్థానం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న రాజ్యాంగ సవరణ బిల్లులను వ్యతిరేకించాలని స్థానిక మజీద్ ఇమామ్ షఫీకుర్ రెహమాన్ తెలిపారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఈద్గా వద్ద రహదారిపై ముస్లింలు రంజాన్ నమాజ్ అనంతరం రాజ్యాంగ సవరణ బిల్లుపై నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జంక్షన్ నాలుగు రోడ్లు మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్ రెహమాన్, స్థానిక మదీన మజీద్ కమిటీ గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ బారీ మాట్లాడుతూ, వక్ఫ్‌బోర్డులో ఇతర మతస్తులకు స్థానం కల్పించడం అన్యాయమన్నారు. స్థానిక ముస్లిం నాయకులు సయ్యద్ జానీ, షేక్ జానీ, మసీదు నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఉంగుటూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కుమారుడితో కలిసి బైక్‌పై వెళ్తున్న మహిళ మెడలోనుంచి మూడు కాసుల బంగారు గొలుసు (నాంతాడు)ను లాక్కుని బైక్‌పై పరారైన సంఘటన ఆదివారం రాత్రి ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెదఅవుటపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌జంక్షన్‌లోని హనుమాన్‌నగర్‌కు చెందిన పొనుగుమాటి భానుమతి (50) తన కుమారుడు నితీష్(22)తో కలిసి బైక్‌పై ఆదివారం సాయంత్రం చినఅవుటపల్లిలోని పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు వెళ్లారు. తిరిగి రాత్రి 7గంటల సమయంలో ఇంటికి బయలుదేరారు. పెదఅవుటపల్లి ఫ్లైఓవర్‌బ్రిడ్జి కిందనుంచి హనుమాన్‌జంక్షన్‌వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులోకి బైక్ మలుపుతిరుగుతున్న క్రమంలో వెనుకగా పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు నితీష్ బైక్‌పై వెనుక కూర్చున్న భానుమతి మెడలోనుంచి గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాలు ఆత్కూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై దర్యాప్తు చేపట్టారు.



హోమాలు చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, భక్తులు

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

గన్నవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పద్మావతి అలివేలు మంగా సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయనికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్మించారు. సుమారు రూ.2కోట్లతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతీస్వామి పర్యవేక్షణలో వేదపండితులు గోపూజ, విఘ్నేశ్వర పూజతో శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతనంగా నిర్మించనున్న ఆలయానికి ముఖ్య అతిథిగా ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, విజయలక్ష్మి దంపతులు, నిర్మాణ కమిటీ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, జాస్తి విజయభూషణ్ కుమార్, ఎంవీఎల్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు మరీదు లక్ష్మీదుర్గ, శౌంతి కిషోర్, కమిటీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి మరీదు రాంబాబు, కోశాధికారి పలగాని నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

● నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణానికి దా తలు భారీ విరాళాలను అందజేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, విజయలక్ష్మి దంపతులు రూ.10,00,116 లక్షలు, వీరి కుటుంబ సభ్యులైన జాస్తి సత్యనారాయణ, రజని కుమారి దంపతులు, చింతల శ్రీదేవి, శ్రీనివాసరావు దంప తులు కలసి రూ.5,01,116 లక్షలు, ఆలయ కమిటీ సభ్యులైన 15 మంది ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున రూ.15 లక్షలు విరాళాలు అందజేశారు.

వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ

ఉంగుటూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని యూనియన్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం (యూబీఆర్‌ఎస్‌ఈటీఐ)లో ఏప్రిల్ 7నుంచి మహిళా టైలరింగ్ కోర్సు (30రోజులు)లో శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు శిక్షణా సంస్థ డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, యూబీఆర్‌ఎస్‌ఈటీఐ ద్వారా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పలు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించడంతోపాటు స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో పుట్టగొడుగుల పెంపకం (10రోజులు), కొవ్వొత్తుల తయారీ (10రోజులు), జ్యూట్‌బ్యాగుల తయారీ (13రోజులు), కంప్యూటర్ ట్యాలీ కోర్సు (30రోజులు), బ్యూటీషియన్ కోర్సు (30రోజులు), సెల్‌ఫోన్ రిపేరింగ్ అండ్ సర్వీసెస్ (30రోజులు)వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణలు ప్రారంభమవుతాయన్నారు. ఇతర వివరాలకు 6304254730, 9490011081 నెంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

● మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
● ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్న ముస్లింలు

పెనమలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పవిత్ర రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. యనమలకుదురు, తాడిగడప, పోరంకి, కానూరు సనత్‌నగర్, పెదపులిపాక, చోడవరం గ్రామాల్లో ముస్లింలు మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కానూరు సనత్‌నగర్‌లోని రేకుల మసీదు వద్ద జరిగిన పవిత్ర ప్రార్థనల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జిలు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



ఉయ్యూరు ఈద్గాలో ప్రార్థనలు

ఉయ్యూరు : ఉయ్యూరులో రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రంజాన్ మాసంలో నెల రోజులపాట కఠోర నిష్టతో ఉపవాసం చేసి ఆదివారం పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. జామియా మసీదు, చిన్న మసీదు, దాయరా మసీదుతో పాటు ఇతర మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని అనంతరం దాయరా మసీదుకు చేరుకుని పెద్దలను స్మరించుకున్నారు. పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరి కొకరు ఈద్ ముబారక్ అని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ అబుకలాం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, నగర పంచాయతీ కో-ఆప్షన్ సభ్యుడు ఖలీల్, జలీల్, ఉయ్యూరు మాజీ ఛైర్మన్ ఖుద్దూస్, టీడీపీ నాయకుడు అల్‌రియాజ్, అనీస్, ఘోరా తదితరులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



ముస్తాబాద ఈద్గాలో..

గన్నవరం : క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల మేలుకలయికే పవిత్ర రంజాన్ అని మసీద్ ఇమామ్ హఫీజ్ హసీన్ ఇక్బాల్ అన్నారు. మండలంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్తాబాద ఈద్గాలో ఇక్బాల్ సందేశమిస్తూ నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు పూర్తి చేసి ప్రత్యేక తరాబి నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలకు నిజమైన పండుగ అని పేర్కొన్నారు. అల్లా చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని చెప్పారు. కమిటీ అధ్యక్షులు హుస్సేన్, కార్యదర్శి కరిముల్లాలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గన్నవరం, వీరపనేనిగూడెం తదితర గ్రామాల్లో రంజాన్ ప్రార్థనలు జరిగాయి.



కానూరు సనత్‌నగర్ రేకుల మసీదు వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, షేక్ బుజ్జి

హనుమాన్‌జంక్షన్ : స్థానిక ఏలూరు రోడ్డులోని ఈద్గా వద్ద సోమవారం హస్సీ నౌజవాన్ అంజుమాన్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ ఉపవాస దీక్షలు ముగింపు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మదీనా మజీద్ ఇమామ్ షఫీ కుర్రెహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థన కార్యక్రమంలో వేలాది మంది మతస్తులు పాల్గొని ప్రార్థనలు జరిపారు. పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమాన్ని అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, కార్యదర్శి షేక్ మీర్జావలి, కమిటీ సభ్యులు మీరా, షేక్ అబ్దుల్లా, ఎండీ రఫీ పర్యవేక్షించారు.



హనుమాన్‌జంక్షన్ ఈద్గాలో..

చెరుకు రైతు సంఘ ఉపాధ్యక్షుడు
వెంకట నరసింహారావు మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : చెరుకు రైతు సంఘ ఉపాధ్యక్షుడు పూషడపు వెంకట రంగారావు(85) సోమవారం అనారోగ్య కారణాలతో మర్రిబంధంలో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. చెరుకు రైతు అభివృద్ధి కోసం నిరంతం కృషి చేస్తూ 1983 నుంచి షుగర్ ఫ్యాక్టరీ మూసివేత వరకూ చెరుకు ఉత్పత్తిదారుల సంఘ ఉపాధ్యక్షుడిగా సేవలందించిన పూషడపు వెంకట రంగారావు మృతి తీరని లోటని కార్యదర్శి నందూరి సత్యవెంకటేశ్వరశర్మ అన్నారు. రైతు నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, నందూరి సత్యవేంకటేశ్వరశర్మ, తదితరులు నరసింహారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కల్యాణమండపం ప్రారంభం

పెనమలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : చోడవరం రామాలయంలో కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కలపాల శ్రీధర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల జిల్లా నాయకురాలు
వై.నాగలక్ష్మి మృతి

గన్నవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల జిల్లా నాయకురాలు వైనాగలక్ష్మి (55) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. మండలంలోని ముస్తాబాద గ్రామానికి చెందిన ఆమె గ్రామంలోని పీహెచ్‌సీలో ఆశావర్కర్‌గా పని చేస్తున్నారు. సీపీఎం, ప్రజా సంఘా ల్లో చురుకైన పాత్ర నిర్వహించారు. ఆశావర్కర్ల సమస్యలపై పోరాటాలు చేయటంతో పాటు ప్రజానాట్య మండలి ద్వారా ప్రజలను చైతన్య పరిచేవారు. అంత్యక్రియలు మంగళవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆరోగ్యస్వామికి సత్కారం

గన్నవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి వీకేఆర్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న గోళ్ల ఆరోగ్యస్వామి పదవి విరమణ సందర్భంగా నాన్ టీచింగ్ సిబ్బంది సోమవారం దుశ్శాలువ, పూలబొకేలతో ఘనంగా సత్కరించారు. శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం నాయకుడు దేవరపల్లి ఏసుబాబు అన్నారు. నాయకులు బాల శ్రీనివాస్, ప్రసాద్, సంతోష్, అన్నమ్మ, అధ్యాపకుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.



బిళ్లనపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, ఆళ్ల గోపాలకృష్ణ

బిళ్లనపల్లి అభివృద్ధికి
యార్లగడ్డ వెంకటేశ్వరావు కృషి మరువలేనిది

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బిళ్లనపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా మెట్ట ప్రాంత రైతుల ఆర్థికస్వావలంబనకు సేవలందిస్తూ టీడీపీ నాయకుడిగా పార్టీ అభివృద్ధితో పాటు గ్రామాభివృద్ధికి యార్లగడ్డ వెంకటేశ్వరావు అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ కొనియాడారు. బిళ్లనపల్లి మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరావు(76) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, రైతు సమాఖ్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూ డి బాబూరావు, మొవ్వా వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఆరుమళ్ల కృష్ణారెడ్డి, మడిచర్ల డీసీ ఛైర్మన్ దేవినేని సత్యనారాయణ, వల్లూరిపల్లి నాని, అక్కినేని రవి, కాకుమాను గోపి, ఆలూరి రామ కృష్ణప్రసాద్, వెలివెల వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

తపస్సు కాలంలో పుణ్యక్షేత్రాలను సందర్శించాలి

గన్నవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తపస్సు కాలంలో క్రైస్తవ భక్తులు బాలయేసు దేవాలయాలు, పుణ్యక్షేత్రాలను సందర్శించాలని విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ నూతలపాటి కిషోర్ అన్నారు. మండలంలోని కేసరపల్లి ఆర్సీఎం విచారణ భక్తులు సోమవారం బస్సుయాత్ర నిర్వహించారు. గుంటూరు జిల్లాలో ఉన్న యడ్లపాడు, నరసరావుపేట, ఫిరంగిపురం, నగరపాలెంలోని పుణ్యక్షేత్రాలను సందర్శించారు. నరసరావుపేట బాలయేసు దేవాలయ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జోజయ్యతో కలసి ఫాదర్ కిషోర్ సమిష్టి దివ్యబలిపూజ నిర్వహించారు. ప్రపంచ శాంతి, అనాధ, రోగులు, దేశ ప్రజల కోసం, దేశ అభివృద్ధి కోసం, పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

100 మందికి వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం జంక్షన్ ఆర్యవైశ్య సేవా ట్రస్టు, విజయవాడ నరేశ్ హోమియో స్టోర్సు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో100 మంది రోగులకు పరీక్షలు జరిపి మందులను ఉచితంగా అందజేసినట్లు ట్రస్టు నిర్వాహకులు బొమ్మిశెట్టి రామారావు తెలిపారు. విజయవాడ హోమియో వైద్యనిపుణులు దుబాషి రమేశ్, సుభాషిణి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘం నేతలు కొనకళ్ల రాజశేఖర్, వెచ్చా వెంకటేశ్వరరావు, చామర్తి రాంబాబు, పైడి సుధాకర్, గార్లపాటి రామకృష్ణ, కంభంపాటి శ్రీనివాసరావు, లోక్‌నాథ్ పర్యవేక్షించారు.

మర్యాదపూర్వక కలయిక

టీడీపీ నేతలు కొనకళ్ల, వైవీబీని కలిసిన అన్నే ధనయ్య

కంకిపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును, మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్‌ను కంకిపాడు మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా ప్రభుత్వం ప్రకటించిన అన్నే ధనరామకోటేశ్వరరావు (ధనయ్య) సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానిక విలేకరులతో అన్నే ధనయ్య మాట్లాడుతూ, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ తెలుగుదేశం పార్టీలో గుర్తింపు ఉంటుందని ఇందుకు ఉదాహరణ తనకు పదవి కేటాయించ డమేనన్నారు. పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశామన్నారు. తమ కృషిని గుర్తించి ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పార్టీ అధిష్టానం తనకు ఈ పదవిని అప్పగించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి రాజేంద్రప్రసాద్‌లు సూచించారని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పీహెచ్‌సీ మాజీ అధ్యక్షులు పడవల మధుసూదనరావు, టీఎస్టీఈ యూనీ జిల్లా అధ్యక్షులు కొండవీటి శివయ్య, ఉప్పలూరు గ్రామ పార్టీ అధ్యక్షులు చలసాని రాధాకృష్ణమూర్తి, కాజా బ్రహ్మాజీ, కొండేటి సాంబశివరావు, బద్దల భార్గవ్ శివ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన అన్నే ధనయ్య



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	167, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పూర్ణచంద్రరావు

గుడివాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొన్న సంఘటన ఆదర్శనగర్ శివారులోని తట్టివర్రురోడ్డులో సోమవారం చోటుచేసుకుంది. నందివాడ మండలం పోలుకొండ నుంచి తట్టివర్రు గోడౌన్‌కు వెళుతున్న ఏపి 39ఎక్స్ 7484 నెంబరుగల 10టైర్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ, తట్టివర్రు వైపు వస్తున్న పాటిమీదకు చెందిన చల్లా పాండురంగారావుని ఎదురుగా ఢీకొంది. దీంతో ఆయన తలకు బలమైన గాయమై, సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



మొవ్వ మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా

గుడివాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : గుడివాడలో ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మియాఖాన్, నూర్, గుల్జార్‌చౌక్, మసీద్-ఎ-మహ్మదీయ, షాహీ మసీదు, మల్లాయిపాలెం లోని మసీద్-ఎ- మహ్మదీయ, షాహీ మసీదు, కొత్త మల్లాయిపాలెం, ఆటోనగర్‌లలోని మసీదుల్లో మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు చేస్తూ, జకాత్, ఫిత్రాల పేరుతో దానధర్మాలు చేశారు. ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

కూచిపూడి: రంజాన్ సందర్భంగా నిడుమోలులోని పలువురు ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అందజేశారు. ఈ సందర్భంగా మసీదులో జరిగిన రంజాన్ పర్వదిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం స్థానిక రామాలయాన్ని సందర్శించి స్వామి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కుమార్ రాజాను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అయ్యంకి గ్రామంలో నిర్వహించిన నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

రంజాన్ వేడుకలను మొవ్వ మండలం లోని పెదపూడి, కూచిపూడి, భట్లపెనుమర్రు, మొవ్వ, కాజ, కోసూరు తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు వస్త్రాలు అందజేశారు. భట్లపెనుమర్రులో జరిగిన కార్యక్రమంలో మహమ్మద్ యాకుబ్ బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మత పెద్దలు రంజాన్ విశిష్టతను తెలియజేశారు.



డోకిపర్రు మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



పామర్రు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గుడివాడ రూరల్ : పాత మల్లాయిపాలెం, కొత్త మల్లాయిపాలెం గ్రామాల్లో ముస్లింలు ఉదయం నుంచే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్సై చంటిబాబు ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రంజాన్ సందర్భంగా మండలంలోని గుడ్లవల్లేరు, కౌతవరం, డోకిపర్రు, శేరిదగ్గుమిల్లి, సుబ్బిచెరువు, కట్టానిచెరువు, అంగలూరు, పెంజండ్ర, వేమవరం గ్రామాల్లోని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు నమాజు అనంతరం ఖురాన్ బోధనలు చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

పామర్రు : స్థానిక ఈద్గా వద్ద సోమవారం ముస్లింసోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ముస్లీం మతగురువు యూనుస్ ఉమ్రీ మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే పవిత్రరంజాన్ పర్వదినమన్నారు. పేదలెవరూ ఆకలిబాధలతో ఉండకూడదని ఉన్నంతలో సాటివారికి దానధర్మాలు చేశారు. కులమతాలకు అతీతంగా పుర వీధుల్లో ముస్లీంలకు అన్నిమతాల వారు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లీం పర్సనల్ లా బోర్డుపిలుపు మేరకు వక్ఫ్ సవరణ బిల్లు 2024కి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా పామర్రులో నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పామర్రు మసీదు కమిటీ ప్రెసిడెంట్ ఎండీ ఆరిఫ్, సభ్యులు షకీల్, ముస్తాఖీం, షరీఫ్, షామెబ్, తదితరులు పాల్గొన్నారు. ఇదే విధంగా మండలంలోని భానుపూడి, సత్రాఖాన్‌పాలెం, పెదమద్దాలిలో ముస్లీంలు ఘనంగా రంజాన్ పర్వాదినాన్ని జరుపుకున్నారు.

పెదపారుపూడి: ముస్లింలు జరుపుకునే అతి పెద్ద పండుగల్లో రంజాన్ ఒకటి. ఆధ్యాత్మిక పునరద్ధరణ, హృదయ శుద్ధితోపాటు అల్లాహ్ కృపను పొందే పవిత్రమైన పండుగగా భావిస్తారు. ఈ నెలలో ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్షలు పాటిస్తూ, దాన ధర్మాలు, ప్రార్థనలు నిర్వహిస్తారు. ఉపవాసదీక్షలు ముగిసిన తర్వాత ఈద్ ఉల్ ఫితర్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వెంట్రప్రగడలోని ముస్లిం సోదరులు మసీదులో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాజీ, షేక్ అన్వర్ బాషా, షేక్ అజీజ్ పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో సోమవారం పవిత్ర రంజాన్ పండుగను ముస్లీంలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సెంటర్లోని అంజుమన్ భవనంపై మత గురువు షేక్ హాసన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఉపవాస దీక్షలు ముగించిన ముస్లీంలు రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత గురువు రంజాన్ సందేశాన్ని అందించారు. ఐలూరు, వల్లూరుపాలెం గ్రామాల్లోనూ ముస్లీంలు రంజాన్ పండుగను జరుపుకున్నారు.



గుడివాడలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



తోట్లవల్లూరులో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మృతుని కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ చెక్కును అందచేస్తున్న బాబూరావు

బీమా చెక్కు అందజేత

గుడ్లవల్లేరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) :గోపాలరక్ష పథకం బీమా చెక్కును సోమవారం వడ్లమన్నాడులో పాడిరైతు కుటుంబానికి జిల్లాపాల ఉత్పత్తిదారుల సంఘ డైరెక్టర్ వి.బి.కె.బి. సుబ్బారావు(బాబూరావు) అందజేశారు. వడ్లమాన్నాడు పాల ఉత్పత్తిదారుల సంఘంలో పాలుపోసే రైతు పాలేటి నాగరాజు ఇటీవల మృతి చెందాడు. మృతుని కుటుంబానికి గోపాలరక్ష పథకం కింద బీమా ఒక లక్ష రూపాయలు చెక్కును అతని భార్య పాలేటి నాగమణికి వి.బి.కే.బి సుబ్బారావు చేతులమీదుగా అందజేశారు. అన్నివిధాలా కృష్ణా మిల్క్ యూనియన్ పాడిరైతులను ఆదుకుంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో వడ్లమన్నాడు సంఘ అధ్యక్షులు కొణతం కృష్ణ, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజరు తోట సత్యనారాయణ , సూపర్‌వైజరు రాజాకుమార్ పాల్గొన్నారు.

గారెలు వండలేదని భర్త ఆత్మహత్య

తోట్లవల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఉగాది రోజు గారెలు వండలేదని భార్యతో గొడవపడి భర్త పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కుమ్మమూరులో చోటుచేసుకుంది. కుమ్మమూరుకు చెందిన మరీదు నాగ నాంచారయ్య(49) ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం భార్యను గారెలు వండమని కోరాడు. పూజా కార్యక్రమాలు పూర్తయ్యాక చేస్తానని భార్య చెప్పింది. దీంతో గొడవపడి క్షణికావేశంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాగ నాంచారయ్య సాయంత్రం ఇంటికి వచ్చి పురుగుల మందు సేవించాడు. దీంతో కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. మృతుడి కుమారుడు గోపీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



బాలకొండలరావు శిష్య బృందం కూచిపూడి అభినయం



కళాకారులను సత్కరిస్తున్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్

నాట్యశిల్పారామంలో ఉగాది సంబరాలు

కూచిపూడి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నాట్య శిల్పారామంలో ఉగాది సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధే శ్యామ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరింపజేశాయి. ప్రముఖ కూచిపూడి కళాకారిణి, హంస అవార్డు గ్రహీత బాలకొండలరావు (విశాఖపట్నం) శిష్యబృందం పలు కూచిపూడి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. అపూర్వ, రమాశైలజ, శైలపుత్ర, మనస్య, రూపశ్రీ, వర్షిత, అనూష, మౌనిషా, హస్విత, కమలిక, హర్షిణిలు కామాక్షి స్తుతి, శివపంచకం, అందానికి నందన వనం కూచిపూడి బృందావనం, త్యాగరాజ స్వామి, అన్నమయ్య కీర్తనలు, దశవతారాలు అంశాలు ప్రదర్శించి ఆద్యంతమూ భక్తిభావంలో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో చలాది పూర్ణచంద్రరావు, భావతరంగిణి సంపాదకులు భవిష్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను, కళాకారులను నిర్వాహ కులు రాధేశ్యామ్ మెమొంటోలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు.



ఇంటిపన్ను వసూళ్లలో పాల్గొన్న డివిజనల్ పంచాయతీరాజ్ అధికారిణి వి.సంపత్‌కుమారి

ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలి

గుడ్లవల్లేరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీరాజ్ అధికారిణి వి.సంపత్‌కుమారి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమె పన్నుల వసూళ్ల వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం గ్రామంలో పలు గృహాలకు పన్నుల వసూళ్లకు ఆమె స్వయంగా బిల్‌కలెక్టర్‌తో కలసి వెళ్లారు. అనంతరం చెత్త నుంచి సంపదకేంద్రం పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.విజయసారథి, కార్యదర్శి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

బోరుపంపు ప్రారంభం

పమిడిముక్కల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) :పెనుమొత్స ఎస్సీకాలనీలో తాగునీటి అవసరాల కోసం గ్రామానికి చెందిన దండమూడి సుబ్బారావు జ్ఞాపకార్థం రూ. 90 వేలతో నూతనంగా ఏర్పాటుచేసిన బోరుపంపును ఆయన కోడలు దండమూడి రాధామణి సోమవారం ప్రారంభించారు. కాలనీలో తాగునీటి అవసరతను స్థానికులు తెలియచేయగా స్పందించిన ఆమె బోరుపంపు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమెకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామప్రముఖులు మొవ్వ రాము, చింతమనేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



టీడీపీ నేతలను సన్మానించిన మైనారిటీ నాయకులు

గుడ్లవల్లేరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీకి మద్దతుగా నిలుస్తున్న ముస్లీం మైనారిటీ కార్యకర్తలకు, నాయకులకు తగిన గుర్తింపును ఇవ్వాలని మండల ముస్లీం నాయకులు మండల టీడీపీ అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరిని కోరారు. రంజాన్ సందర్భంగా ముస్లీం నాయకులు టీడీపీ నాయకులను కలసి మిఠాయిలు తినిపించారు. ఏఎంసీ చైర్మన్‌గా ఇటీవల ఎంపికైన పొట్లూరి రవికుమార్, కొసరాజు బాపయ్య చౌదరి, ఎ.రామ్మోహనరావులను సన్మానించారు. కార్యక్రమంలో సత్తార్, నాగూర్, కరీమ్, జాని, చిన్నా, ఫౌజుల్‌హక్ పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు మాంటిస్సోరి ఉపాధ్యాయుడి ఎంపిక



గుడివాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ప్రతి ఏటా ప్రైవేట్ విద్యాసంస్థలో ఉత్తమ ప్రతిభ చూపినవారికి అందజేసే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డు-2025కు స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సయ్యద్ యాకుబ్‌పాషా ఎంపికయ్యారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 14వ తేదీన గుంటూరులో ఈ అవార్డు ప్రధానం చేయనున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న తనకు విద్యార్థుల పట్ల మరింత బాధ్యత పెంచిందని అవార్డు గ్రహీత యాకుబ్‌పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ రాష్ట్ర కన్వీనర్ పి.రాజు రత్నకుమార్, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నాగయ్యలకు యాకుబ్ పాషా ధన్యవాదాలు తెలిపారు.



పామర్తి లీలావతిని సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘ సభ్యులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

గుడివాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని ఎస్‌బీఐ(ఒరిస్సా) చీఫ్ మేనేజర్ ఎం.జానకీ రామ్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను విశ్వకర్మ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం, గుడివాడ సాహితీ మిత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కందేపు వీరభోగ వసంత రాయశర్మ పంచాంగ శ్రవణం గావించారు. ఇటీవల సాహితీ మిత్రులు సంస్థ నిర్వహించిన కవితల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విజయవాడకు చెందిన డాక్టర్ పామర్తి లీలావతి, తృతీయ బహుమతి సాధించిన పి.వి.వి. నాగరాజకుమారి, కవిత్వ పోటీల్లో విశేషకృషి చేస్తున్న బత్తిన అగస్త్యేశ్వరరావు, ఆముదాల గోపిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల అధ్యక్షులు వసుధ బసవేశ్వరరావు, ఏఎన్ఆర్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ఎం.సువర్చల, విశ్రాంత ఉపాధ్యాయులు వంగిపురపు వీరరాఘవాచారి, ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు చింతలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కూటమి నాయకులు

గుడివాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : రెండో భద్రాద్రిగా పేరుగాంచిన మోటూరులోని సీతారాముల కల్యాణ మహోత్సవాలను తిలకించి ప్రతి ఒక్కరూ స్వామి కృపకు పాత్రులు కావాలని కూటమి నాయకులు కోరారు. స్థానిక ప్రజావేదికలో ఉత్సవ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు సోమవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానంలో ప్రతి ఏడాదీ శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు స్వామి తిరుకల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నామన్నారు. 6వ తేదీన జరిగే శ్రీరామనవమి పర్వదిన వేడుకలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ, చేకూరు జగన్మోహనరావు, రాంబాబు, దేవస్థాన కమిటీ సభ్యులు ఆనందాసు వెంకటరామయ్య నాయుడు, మానేపల్లి సురేష్, గంటా వంశీ, గంగణపల్లి రాజ్యలక్ష్మీ, యార్లగడ్డ నాగమణి, కోడూరు సుధారాణి, గురువెల్లి సంతోషిణి, పంతగాని స్వాతి, గంటా చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నిరసనను జయప్రదం చేయండి : ఎస్‌టీయూ



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాప్టో నేతలు

కూచిపూడి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 2వ తేదీన ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కృష్ణా జిల్లా ఫ్యాప్టో చైర్మన్ అంబటి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘ నేతలు కూచిపూడిలో సమావేశం నిర్వహించారు. అనంతరం నిరసన కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు ఎం.రవీంద్రబాబు, ఎం.శ్రీనివాసరావు, బి.మాణిక్యాలరావు, సోమేశ్వరమ్మ, ఈవీ.రామారావు, పాగోలు రమేష్‌బాబు, సురేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) పిలుపు మేరకు ఈ నెల 2వ తేదీ మంగళవారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని ధర్నాచౌక్‌లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. ఇమ్మానియేల్, డి.చంద్రశేఖర్‌లు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 12వ వేతన సవరణ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి చెల్లింపు, పెండింగ్ బకాయిల విడుదల, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపు తదితర సమస్యల సత్వర పరిష్కారం కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, ఫ్యాప్టో సభ్యసంఘాల కార్యకర్తలు విరివిగా పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	162, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

అవనిగడ్డ పంచాయతీకి తగ్గిన ఆశీల ఆదాయం

అవనిగడ్డ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ పంచాయతీకి ఆశీల వసూలు ఆదాయం భారీగా తగ్గింది. గతేడాది రూ.16.50 లక్షలకు ఆశీలు పాట వెళ్లగా, ఈ ఏడాది కేవలం రూ.7.23 లక్షలకే పాట పాడుకున్నారు. దీంతో గత ఏడాది కంటే పంచాయతీ ఆదాయం రూ. 8.82 లక్షల మేర తగ్గింది. రెండు సార్లు ఆశీల వసూలుకు పాట నిర్వహించగా, ఎవరూ ముందుకు రాకపోవటంతో అప్‌సెట్ ధర తగ్గించి పాట నిర్వహించటంతో పంచాయతీకి ఆదాయం తగ్గింది. పంచాయతీ కార్యదర్శి అనిత, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, మాజీ ఉపసర్పంచ్ గాజుల జైగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

మచిలీపట్నం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం మచిలీపట్నం యూనిట్ కార్యవర్గ ఎన్నిక సోమవారం జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా డి.ఆర్.కె. శర్మ, కార్యదర్శిగా మోటేపల్లి వనజ, ఉపాధ్యక్షుడిగా పరిశె వీరాస్వామి, జాయింట్ సెక్రటరీగా డి.పావని, కోశాధికారిగా టి.రమేష్, జిల్లా కౌన్సిలర్‌లుగా కళ్లేపల్లి శ్రీనివాసరావు, పి.ఎ.ఎస్. శ్రీనివాసాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మేడేపల్లి నాగేశ్వరరావు, పరిశీలకునిగా కిలారు నాగేశ్వరరావు వ్యవహరించారు. మచిలీపట్నం, గూడూరు మండల పరిషత్ ఉద్యోగులు, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయేతర సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీ వల్లభనేని బాలశౌరిని కలిసి గ్రామాల్లోని తాగునీటి సమస్యను వివరించిన పెదయాదర సర్పంచ్ గల్లా తిమోతి

గ్రామాల తాగునీటి సమస్య పరిష్కరించాలి

● ఎంపీకి పెదయాదర సర్పంచ్ వినతి

మచిలీపట్నం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం పెదయాదర, చిన్నాపురం తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ వల్లభనేని బాలశౌరిని పెదయాదర సర్పంచ్ గల్లా తిమోతి కోరారు. సోమవారం ఎంపీ బాలశౌరిని ఇంటి వద్ద గల్లా తిమోతి, మరి కొందరు నాయకులు కలిసి గ్రామాల్లోని దళితవాడలు, స్లమ్ ఏరియాల్లో తాగునీటి సమస్యను వివరించారు. వల్లభనేని బాలశౌరి స్పందిస్తూ, ఓవర్‌హెడ్ ట్యాంకులకు ఎంపీ నిధులు అందజేస్తామని హామీ ఇచ్చారు.



ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి

నాగాయలంక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిని ఖండిస్తూ కృపా పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నాగాయలంక పురవీధుల్లో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్‌ది ప్రమాదం కాదని, హత్యేనని ఆరోపించారు. ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ నిరసన ర్యాలీకి కిరణ్ నేతృత్వం వహించారు.



వైభవంగా గంగానమ్మ జాతర

కోడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : గంగానమ్మ అమ్మవారి 50వ జాతర మహోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. సోమవారం వేకువజాము నుంచే భక్తులు పశువులు, వాహనాలను ఆలయం చుట్టూ తిప్పి పసుపు, కుంకుమ సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కోడూరు ఎస్సై చాణిక్య ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



చింతకోళ్ల గ్రామంలో ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా

మండలి ఫౌండేషన్ తాగునీటి సరఫరా

కోడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ ఆధ్వర్యంలో తీర ప్రాంత గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. మండలంలోని చింతకోళ్ల, పాలకాయితిప్ప గ్రామాల ప్రజలకు సోమవారం మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 వేల లీటర్ల తాగునీటిని ట్యాంకర్ ద్వారా సరఫరా చేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య, జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, పార్టీ నాయకులు పూతబోయిన కరుణ కుమార్, పూతబోయిన సీతారత్న సాయిబాబు, తాతా శ్రీరామ్మూర్తి, కడవకొల్లు రంగా, ముద్దినేని చంద్రరావు, సనకా జగన్, బెల్లంకొండ వెకటేశ్వరరావు, శ్రీనివాసరావు, గల్లా బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



బందరు ఈద్గాలో సందేశమిస్తున్న ప్రభుత్వ ఖాజీ మహ్మద్ హుస్సేన్



పెడన ఈద్గా వద్ద ప్రార్థనల్లో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



చల్లపల్లి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ఖురాన్ గురువు



గూడూరు ఈద్గా వద్ద సందేశం ఇస్తున్న హఫీజ్

భక్తిశ్రద్ధలతో రంజాన్

● ఈద్గాలలో వేలాదిగా ముస్లింల ప్రార్థనలు
● ఇమాం, మత పెద్దల పండుగ సందేశం
● చిన్నారులు, పెద్దలు పరస్పరం శుభాకాంక్షలు
● ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపిన హిందువులు
● మసీదులు, ఈద్గాల వద్ద పేదలకు దానం

మచిలీపట్నం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మచిలీపట్నంలోని ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ హుస్సేన్ రంజాన్ విశిష్టతను వివరిస్తూ సందేశం ఇచ్చారు. అల్లా కృపతో ప్రతి ఒక్కరూ తోటివారి పట్ల ప్రేమను పెంచుకోవాలన్నారు. పవిత్రతను, సేవా భావాన్ని కొనసాగించాలన్నారు. టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖాజా, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్, షేక్ అమీర్, పాషాలతో పాటు జనసేన నాయకులు మాదివాడ రాము, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అబ్దుల్ మతీన్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా తదితరులు మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా అందరూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్న పిల్లలు సైతం శుభాకాంక్షలు తెలిపారు. కాగా నగరంలోని వివిధ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేడుకగా రంజాన్ పండుగను జరుపుకున్నారు. **పెడన** : రంజాన్ పండుగ సందర్భంగా గుడివాడ రోడ్డులోని ఈద్గాల వద్ద వేలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత గురువులు పవిత్ర రంజాన్ మాసం ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ఉపన్యాసాలు చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రార్థనల్లో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పెడన పట్టణంలో రంజాన్ పండుగ ఘనంగా జరిగింది. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంపన్న ముస్లింలు పేద ముస్లింలకు ఫిత్రా ఇచ్చారు. **గూడూరు** : మండలంలో ముస్లింలు ఈదుల్ ఫితర్ (రంజాన్) పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు ఈద్గాలో, పోలవరం, మల్లవోలు, తరకటూరు, ఆకులమన్నాడు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **అవనిగడ్డ** : రంజాన్ పర్వదినాన్ని అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. జామియా మసీదు వద్ద ఇమామ్ ఎండి.సహజాద్ నేతృత్వంలో



చల్లపల్లిలో చిన్నారులు పరస్పరం శుభాకాంక్షలు



రంజాన్ తోఫా అందిస్తున్న సీఐ, ఎస్సై, గురవయ్య

ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, బుద్దప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, అల్లుడు శీలం అశ్విన్ కుమార్ పాల్గొన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, నవజీవన్ విద్యాసంస్థల అధినేత కొండవీటి ఈశ్వరారవు, మత పెద్దలు షేక్ బాబావలి, మొగల్ మురాద్ బేగ్, షేక్ రెహమాన్, షేక్ ఖలీల్, షేక్ బషీర్, మసీద్ ప్రెసిడెంట్ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : చల్లపల్లిలో ఈదుల్ ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్ద మసీదు వద్ద నుంచి ఈద్గా వరకు ర్యాలీగా చేరుకున్నారు. ఈద్గా మైదానంలో చల్లపల్లి, లక్ష్మీపురం గ్రామాల ముస్లింలతో ఖురాన్ గురువు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అల్లాను ప్రార్థించారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్ద మసీదు, నారాయణరావు నగర్ మసీదు కమిటీ అధ్యక్షులు, ముస్లిం పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, పడమరవీధిలోని నిరుపేద 45 ముస్లిం కుటుంబాలకుచల్లపల్లి లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు అడపా గురవయ్య - అడపా రాంబాబు సోదరుల ఆధ్వర్యంలో రంజాన్ తోఫా అందజేశారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి. సుబ్రహ్మణ్యంల చేతులమీదుగా రంజాన్ తోఫా అందించి శుభాకాంక్షలు తెలిపారు. పఠాన్ కరీముల్లాఖాన్, చాన్ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు** : రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల్లో పత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వంతెన సెంటర్ మసీదు వద్ద, ఇస్మాయిల్ బేగ్‌పేటలోని ఈద్గా వద్ద మత గురువు మౌలాలి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆత్మీయ ఆలింగనలతో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. **ఘంటసాల** : ఘోటకం ఏ-కాలనీలోని జామియా మసీదులో రంజాన్ సందర్భంగా ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఇమామ్ అబ్దుల్ గఫార్ రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు ఎస్‌కె.బాషా, ఉపాధ్యక్షుడు ఎస్‌కె.మహబూబ్ సుభానీ, కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు. మానవ సేవ అత్యున్నతమైనదని చాటి చెప్పే రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మత గురువు వివరించారు. ప్రధాన రహదారిలోని మసీదు వద్ద, లంకపల్లిలోని మసీదులో ప్రత్యేక నమాజ్ చేశారు. **నాగాయలంక** : మండలంలో రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జామియా మసీదులో ప్రార్థనలు చేశారు. మత పెద్ద షేక్ సత్తార్ ఖురాన్ పఠించి ముస్లిం సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. షేక్ జాని, పఠాన్ సుభాని, షేక్ రహంతుల్లా తదితరులు పర్యవేక్షించారు.



యర్రారెడ్డిపాలెం గ్రామంలో ప్రత్యేక ప్రార్థనలు



ఘంటసాల జామియా మసీదులో ఇమామ్ అబ్దుల్ గఫార్ సందేశం



వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ

ఘంటసాల, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి) : వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. మసీదు వద్ద నుంచి ప్రధాన సెంటర్ మీదుగా బ్యాంక్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. స్వాతంత్ర్యం కోసం ముస్లింలు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని, ప్రాణాలు సైతం త్యాగం చేశారన్నారు. ఆనాడు ముస్లిం కమ్యూనిటీ కోసం ఇచ్చిన ఆస్తులను కాజేయటానికి కేంద్ర ప్రభుత్వం యత్నం చేస్తోందని విమర్శించారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఘంటసాలలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టామని, వక్ఫ్ బోర్డు బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. జామియా మసీదు కమిటీ అధ్యక్షులు ఎస్‌కె.బాషా, ఉపాధ్యక్షులు ఎస్‌కె.మహబూబ్ సుభాని, ఇమామ్ అబ్దుల్ గఫార్, యూత్ ప్రెసిడెంట్ ఎస్‌కె.మస్తాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



కళారత్న అవార్డు గ్రహీత విహారిని సత్కరిస్తున్న సాహితీ ప్రియులు



బృందగానం చేస్తున్న గాయనీ గాయకులు

ప్రపంచంలో తెలుగు భాషకు ప్రత్యేక స్థానం

● కళారత్న అవార్డు గ్రహీత విహారి

మచిలీపట్నం టౌన్ , మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో తెలుగు భాషకు ఒక ప్రత్యేక స్థానం ఉందని కళారత్న అవార్డు గ్రహీత విహారి అన్నారు.ఆంధ్ర సారస్వత సమితి, తెలుగు భాషా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో బాలాజీ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కళారత్న అవార్డు అందుకున్న జాతీయ రచయిత విహారి, ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావులను ఘనంగా సత్కరించారు. ఆంధ్ర సారస్వత సమితి అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి జివి పూర్ణచంద్ , సాహితీ మిత్రులు అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, ప్రముఖ విద్యావేత్త దిట్టకవి వెంకటేశ్వరరావు, ఆంధ్రసారస్వత సమితి కార్యదర్శి అప్పినీడు పోతురాజు, కరెడ్ల సుశీల , మడమల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. డి శ్రీహరి, డా ఓలేటి ఉమాసరస్వతి, కారుమూరి రాజేంద్ర ప్రసాద్, మేడిశెట్టి యోగేశ్వరరావు, గురజాడ రాజేశ్వరి స్వీయ కవితలు వినిపించారు.

వీనుల విందుగా త్యాగరాజ కీర్తనలు

త్యాగరాజ సంగీత విద్యాపీఠం వార్షికోత్సవాల సందర్భంగా వివేకానంద మందిరంలో సోమవారం గాయనీ గాయకులు త్యాగరాజ కీర్తనలను మృదుమధురంగా గానం చేశారు. సింగరాజు కళ్యాణి, ఆర్. రాజారామ్, ఎన్.ఎస్.సి.హెచ్. పార్థసారధి, వి. భవానీ, కె. మాధవి, వై. రాధికా సుబ్రహ్మణ్యం, ఓరుగంటి మహాలక్ష్మి, విశ్వనాథ శాంతి కుమారి, ఎల్. విజయలక్ష్మి గానం చేశారు. త్యాగరాజ విద్యాపీఠం అధ్యక్షుడు బి.హెచ్.వి.ఎల్. రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సింగరాజు గోవర్ధన్, జె.ఎస్.ఎస్. కృష్ణారావు, కాశీపట్నపు ఉమ, కళ్యాణి, రాజారామ్ తదితరులు నిర్వహించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ సూర్యగోపాల కృష్ణమూర్తి

పది రోజుల ముందుగానే రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్

మచిలీపట్నం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రజలు పది రోజుల ముందుగా రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని జిల్లా రిజిస్ట్రార్ సూర్య గోపాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కె. జగన్ మోహనరావు, కె. నాగశ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్లాట్ బుకింగ్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్యుమెంట్ రైటర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు పాల్గొన్నారు. జిల్లా రిజిస్ట్రార్ సూర్య గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్‌కు ఎక్కువ మంది ఒకే రోజు వస్తున్నందున జాప్యం నివారించేందుకు ప్రభుత్వం స్లాట్ బుక్ చేసుకునే ప్రక్రియ ప్రారంభించిందన్నారు. ఒకరోజు, వారం రోజులు, పది రోజుల ముందుగా కూడా స్లాట్ బుక్ చేసుకుని ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ విధానం వల్ల రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద వేచి ఉండాల్సిన అవసరం ఉండదన్నారు.



ఉగాది వేడుకల్లో సర్పంచ్ దిడ్ల జానకి, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణిలను సత్కరిస్తున్న తెలుగు సమైక్యతా సంస్థ ప్రతినిధులు

కొక్కిలిగడ్డ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు సత్కారం

మోపిదేవి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ముంబై రాష్ట్రం థానే జిల్లా అంబర్‌నాథ్ ప్రాంతంలో తెలుగు సమైక్యతా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో మోపిదేవి మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణిలను ఘనంగా సత్కరించారు. అంబర్‌నాథ్ ప్రాంతంలో గత కొద్ది సంవత్సరాలుగా ముంబైలో స్థిరపడిన తెలుగు ప్రజలంతా తెలుగు సమైక్యతా సంస్థగా ఏర్పడి ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అంబర్‌నాథ్ ప్రాంతంలో సమీప బంధువుల ఆహ్వానం మేరకు ముంబై వెళ్లిన సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను తెలుగు సమైక్యతా సంస్థ ప్రతినిధులు సత్కరించారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

నాగాయలంక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై కె.రాజేష్ తెలిపారు. దిండి గ్రామంలో ఆదివారం రాత్రి అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి, తదుపరి చర్యలకు తహసీల్దార్‌కు రిఫర్ చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.



గోశాలకు విరాళం

పెడన, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పెడన పట్టణంలో నిర్మించనున్న గోశాలకు సూర్యాపేటకు చెందిన చల్లా చిరంజీవి, ఉపేంద్రమ్మ దంపతులు రూ. 10,116 విరాళం ఇచ్చారు. విరాళాన్ని చిరంజీవి, ఉపేంద్రమ్మ దంపతులు ఉగాది రోజున గోశాల నిర్మాణ కమిటీ నాదెళ్ల కోటేశ్వరరావుకు అందజేశారు.

డొక్కా సీతమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రాలు

మచిలీపట్నం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల దాహార్తి తీరుద్దామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. 49వ డివిజన్ వాసవీ భవన్ వద్ద జనసేన నాయకుడు వడ్డి చిరంజీవికుమార్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బండి రామకృష్ణ ప్రారంభించారు. త్వరలో నియోజకవర్గంలో డొక్కా సీతమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ లు, మానవతా వాదులు చలివేంద్రాలు ప్రారంభించాలన్నారు. జనసేన నాయకులు గడ్డం రాజు, వంపుగడల చౌదరి, పినిశెట్టి వేణు, ఉడుముల బుజ్జి, పినిశెట్టి కుమారి, తోట రాజేష్, టీడీపీ నాయకులు సాతులూరి నాంచారయ్య, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.





విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా రంజాన్ వేడుకలు

» రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు



అమరావతి, నంద్యాల కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు. మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో వేడుకలు చేసుకున్నారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈద్గాలో వేలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మసీదులు, ఈద్గాలు కిక్కిరిశాయి.

నేడు ఐచ్ఛిక సెలవు

» ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ విజయానంద్

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం మంగళవారం ఐచ్ఛిక సెలవుగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ముస్లింలంతా సోమవారం రంజాన్ పండుగ జరుపుకొన్నారు. దాదాపు నెల రోజుల పాటు ఉపవాస దీక్షల్లో ఉన్న వారంతా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. దీంతో ఏప్రిల్ 1 తేదీని ఆప్షనల్ హాలీడేగా ప్రకటించాలని ఆంధ్ర ప్రదేశ్ వక్ఫ్‌బోర్డు సీఈవో ప్రభుత్వానికి విన్నవించారు. ఆయన విన్నపం మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

టెన్త్ సోషల్ పరీక్ష యథాతథం

» ఐచ్ఛిక సెలవు వర్తించదు

పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్ష మంగళవారం (నేడు) యథావిధిగా జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు స్పష్టం చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణపై ఎలాంటి అపోహలు లేకుండా సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ విషయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆర్జేడీలు, డీఈవోలను ఆదేశించారు. రంజాన్ పండగ సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులకు ఐచ్ఛిక సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చారు.

కరువు గుప్పిట 51 మండలాలు

» ఆరు జిల్లాల పరిధిలో గుర్తింపు

అమరావతి, మార్చి31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ సీజన్‌లో వర్షాభావం నెలకున్న ఆరు జిల్లాల్లోని 51 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 37 తీవ్ర కరువు, 14 మధ్యస్థ కరువు మండలాలుగా గుర్తించారు. సోమవారం ఈ మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తీవ్ర కరువు మండలాల జాబితాలో నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల; శ్రీసత్యసాయిజిల్లా రొద్దం; కర్నూలుజిల్లా ఆస్పిరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్లు, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి; అనంతపురం జిల్లా బెళుగుప్ప, గుంతకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, ఎల్లనూరు, యాడికి; ప్రకాశంజిల్లా పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు,మర్రిపూడి, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, ఒంగోలు, వెలిగండ్ల, బెస్తవారిపేట; కడప జిల్లా దువ్వూరు, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, కాశినాయన, ఖాజీపేట,చాపాడు,ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, తొండూరు ఉన్నాయి. మధ్యస్థ కరువు మండలాలుగా పత్తికొండ (కర్నూలు); విడపనకల్లు (అనంతపురం); మైలవరం (కడప); తనకల్లు (శ్రీసత్యసాయి జిల్లా);బేతంచర్ల, బనగానపల్లి, సంజామల,ఉయ్యాలవాడ (నంద్యాలజిల్లా); కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, చంద్రశేఖరపురం, పామూరు, రాచర్ల (ప్రకాశం జిల్లా) ఉన్నాయి. ఈ మండలాల రైతులు రుణ సౌకర్యం పొందటానికి, ఇతర సహాయ కార్యకలాపాలు చేపట్టడానికి వీలుగా జిల్లాల గజెట్లు ప్రకటించి, తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

ఈ మూణ్నెల్లూ మంటలే!


పెరగనున్న పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు .. సాధారణం కంటే అధికంగా వడగాడ్పులు



» అనేకచోట్ల 45 డిగ్రీలు, కొన్నిచోట్ల అంతకుమించి..

» వేసవి ఉపశమన ప్రణాళికలు అవసరమంటున్న ఐఎండీ

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే రెండు నెలల నుంచి ఎండలు, వడగాడ్పులకు దేశంలో అనేక ప్రాంతాలు అట్టుడికిపోతున్నాయి. ఇక రానున్న మూడు నెలల్లో కూడా ఎండ తీవ్రత, వడగాడ్పులు అంతకుమించి ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదుకానున్నట్లు పేర్కొంది. ముఖ్యంగా హీట్‌వేవ్ జోన్‌లో ఉన్న దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడతాయన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ వేసవి నుంచి గట్టెక్కడానికి కేంద్ర, రాష్ట్రాల పరిధిలోని విపత్తుల నిర్వహణ సంస్థలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని భారత వాతావరణ శాఖ తొలిసారిగా సూచనలు చేసింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల వేసవి సీజన్‌కు సంబంధించి సోమవారం భారత వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. మూడు నెలల సీజన్‌లో దక్షిణ భారతంలో పడమర ప్రాంతాలు, తూర్పు భారతం, దానికి ఆనుకుని మధ్య భారతంలో కొన్ని ప్రాంతాలు తప్ప.. దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఉత్తర, మధ్య, తూర్పు భారతం, దానికి ఆనుకుని దక్షిణాది రాష్ట్రాల్లో వడగాడ్పులు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడుల్లోని ఉత్తర ప్రాంతంలో సగటు కంటే ఎక్కువగా వడగాడ్పులు వీస్తాయి. సాధారణంగా ఈ సీజన్‌లో నెలకు ఐదు నుంచి ఆరు రోజులు వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీస్తాయి. అటువంటిది ఈ ఏడాది ఈ మూడు నెలల సీజన్‌లో ఐదు నుంచి ఎనిమిది రోజులు వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఏప్రిల్ వరకు చూస్తే పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇంకా వడగాడ్పులు తీవ్రంగా ఉండడంతో పాటు సాధారణం కంటే ఎక్కువ రోజులు కొనసాగుతాయి. ఏప్రిల్‌లో దక్షిణ, పడమర, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా, దేశంలోని మిగతా ప్రాంతాల్లో తక్కువగా వర్షపాతం నమోదుకానుంది. ఏప్రిల్‌లో దేశంలో 39.2 మి.మీ. వర్షపాతం నమోదుకావాలి. గడచిన రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షం జాడ లేకపోడంతో నేల పొడిగా మారిందని, దాంతో ఎండలు, గాడ్పులు పెరిగాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల మేరకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలో హీట్‌వేవ్ కోర్ జోన్‌లో 10 అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు. మార్చిలో అనేకచోట్ల 40 డిగ్రీలు దాటి పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే మూడు నెలల కాలంలో అనేకచోట్ల 45 డిగ్రీలు, అక్కడక్కడా మరింత ఎక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న మూడు నెలల్లో ఎండలు, వడగాడ్పుల ప్రభావం నుంచి తట్టుకునేలా కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలు వేసవి ఉపశమన ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్‌లో పేర్కొంది. వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు, ఆరోగ్యపరంగా ఇబ్బందులుపడే వ్యక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఎక్కువగా చలువ కేంద్రాలు ఏర్పాటుతోపాటు ఆరోగ్యశాఖను అప్రమత్తం చేయాలని, ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం ఇవ్వడం, ఎండలు, గాడ్పుల వల్ల ఇబ్బందులపై హెచ్చరికలు జారీచేయడం, నగరాల్లో అర్బన్ హీట్ ఐలాండ్స్‌ను గుర్తించి చలువ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటివి చేయాలని భారత వాతావరణ శాఖ సూచించింది.



ఏప్రిల్ నుంచి జూన్ వరకు, ఏప్రిల్ నెలలో దేశంలో సాధారణం కంటే ఎక్కువగా వడగాడ్పులు వీస్తాయని అంచనా

ఇలా చేయండి..

రానున్న మూడు నెలలు ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్న ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది.

- ఎండ, వడగాలి ఎక్కువగా ఉన్నప్పుడు వీలైనంత ఇంట్లోనే ఉండాలి. వేడి నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్, కూలర్లు, ఏసీలు వినియోగించాలి.
- ఇంట్లో ఉన్నా, దాహం వేయకపోయినా తరచూ నీరు తాగా లి. సాయంత్రం, రాత్రి వేళ చన్నీటితోనే స్నానం చేయాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ నీళ్లు, కొబ్బరి నీరు తీసుకోవాలి.
- ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే.. తెల్లటి కాటన్ వస్త్రాలు ధరించాలి. తలకు టోపీ పెట్టుకోవాలి. లేదా రుమాలు కట్టుకోవాలి. కళ్లద్దాలు పెట్టుకోవాలి.
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే మంచినీరు/నిమ్మరసం, మజ్జిగ తాగాలి.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు తలతిరగడం వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే.. వడదెబ్బగా గుర్తించి, వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఇవి చేయొద్దు!

- ఎండ, వేడి వాతావరణం ఉన్నప్పుడు బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలు, వయో వృద్ధులు బయట తిరగకూడదు.
- బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు ఎండలో తిరగరాదు.
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే తేనె, పంచదార వంటి తీపి పదార్థాలు తీసుకోకూడదు.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు శీతల పానీయాలు, ఐస్‌లు, ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బొనేటెడ్ డ్రింక్‌లు తాగడం మానుకోవాలి.
- అధిక ప్రొటీన్, ఉప్పు, కారం, నూనె వస్తువులు తీసుకోకూడదు.

కొడాలి నాని ఆరోగ్యం

తీవ్ర ఆందోళనకరం!

» మూడు రక్త నాళాలు బ్లాక్

» సర్జరీ కూడా చేయలేని పరిస్థితి

» ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలింపు



హైదరాబాద్ సిటీ/మచిలీపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆరోగ్య పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనను కుటుంబ సభ్యులు సోమవారం హైదరాబాద్ నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలించారు. కొడాలి నాని గ్యాస్ట్రిక్ (జీర్ణకోశ) సమస్యతో ఐదు రోజుల క్రితం ఏఐజీలో చేరారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా... గుండెకు సంబంధించి తీవ్రమైన సమస్య ఉన్నట్లు బయటపడింది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే మూడు రక్త నాళాలు చాలా వరకు బ్లాక్ అయ్యాయని వైద్యులు నిర్ధారించారు. సాధారణంగా ఇలాం టి పరిస్థితుల్లో బైపాస్ సర్జరీ నిర్వహిస్తారు. అయితే... సర్జరీ చేసేందుకు కొడాలి ఆరోగ్య పరిస్థితి సహకరించదని, చేసినా మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందని వైద్యులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది. మందుల ద్వారా పరిస్థితి మెరుగుపరిచే అవకాశాలను పరిశీలించారు. కానీ... ఫలితం కనిపించలేదు. దీంతో... కొడాలి నానిని సోమవారం ఏఐజీ హైదరాబాద్ నుంచి డిశ్చార్జి చేశారు. కుటుంబం ఆయనను మెరుగైన చికిత్స కోసం బేగంపేట విమానాశ్రయం నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలించారు. సుప్రసిద్ధ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండా చైర్మన్‌గా ఉన్న ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో కొడాలి నానిని చేర్పించినట్లు తెలిసింది. అత్యంత సంక్లిష్టమైన కార్డియాక్ సర్జరీలను విజయవంతంగా చేయగలరని డాక్టర్ పాండాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుంది. 2009లో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌కు కూడా ఆయనే శస్త్ర చికిత్స చేశారు.

ఆర్టీఈ ఫీజుల ఖరారుకు కమిటీ

» నెల రోజుల్లో కొత్త ఫీజులు సిఫారసు

అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) కింద పేద విద్యార్థులకు కేటాయించే సీట్లకు సంబంధించిన ఫీజుల ఖరారుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. గత ప్రభుత్వంలో పట్టణాల్లో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.6,100 చొప్పున ఆర్టీఈకి ఫీజులు నిర్ణయించారు. ఆ ఫీజులతో సీట్లు కేటాయించడం సాధ్యం కాదని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. కోర్టు ఆదేశాలతో ఫీజుల పునఃసమీక్షకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి చైర్మన్‌గా, సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. కమిటీ నెల రోజుల్లో కొత్త ఫీజులను సిఫారసు చేయనుంది. ఆర్టీఈ కింద ప్రైవేటు పాఠశాలలు 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. ఆ ఫీజులను ప్రభుత్వం పాఠశాలలకు చెల్లిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 34వేల మంది విద్యార్థులు ఆర్టీఈ కింద సీట్లు పొంది చదువుతున్నారు. వారికి ప్రభుత్వం ఏడాదికి రూ.62 కోట్లు ఫీజులు చెల్లిస్తోంది.

భూదందాలో బాస్‌లు!

(మొదటి పేజీ తరువాయి)

ఎవరో చెబుతున్న మాట కానేకాదు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ హయాంలో భూముల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిన రెవెన్యూశాఖ తాజాగా సర్కారుకు అందించిన నివేదికలో పేర్కొన్న వాస్తవాలివి. తహసీల్దార్ స్థాయి నుంచి జిల్లాకు సూపర్‌బాస్‌లుగా ఉన్న ఐఏఎస్‌ల వరకు కొందరు ఈ భూ అక్రమాల్లో తిలాపాపం తలాపిడికడు చందంగా పాత్రను పోషించారని రెవెన్యూశాఖ నిగ్గుతేల్చింది. గత జగన్ ప్రభుత్వ హయాంలో చివరి ఏడునెలల కాలంలో అసైన్డ్ భూములపై రైతులకు హక్కులు ఇచ్చేందుకు తీసుకొచ్చిన ఫ్రీ హోల్డ్ విధానంలో భారీగా అక్రమాలు జరిగిన విషయాన్ని రెవెన్యూ శాఖ ఇటీవలే బయటపెట్టిన సంగతి తెలిసిందే. లోతైన విచారణ చేయగా, జగన్ ప్రభుత్వంలోని ఆరుగురు మంత్రులు, తహసీల్దార్, ఆర్డీఓల పాత్ర బయటపడింది. ఇదేకాదు, ఆనాడు జిల్లాకు సూపర్ బాస్‌లుగా పనిచేసిన కొందరు ఐఏఎస్‌ల పాత్రపైనా స్పష్టమైన ఆధారాలు బయటకొచ్చాయి. వైసీపీ నేతల రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వేలాది ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూములు పరాధీనం కావడంలో వారి వైఫల్యం, ఉద్దేశపూర్వక తప్పులు ఉన్నాయని రెవెన్యూశాఖ సర్కారుకు పంపిన నివేదికలో పేర్కొంది.

కంచే చేను మేసింది..

రాష్ట్రంలో అసైన్డ్, ఇనాం, చుక్కల భూమి, షరతు గల పట్టా భూముల విషయంలో ప్రతి జిల్లా, డివిజన్, మండల స్థాయిలో గత ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయి. అందులో 13 జిల్లాల పరిధిలో భారీగా అక్రమాలు చోటుచేసుకోగా, అందులో నాలుగు జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయి. ఊహించని అక్రమాలతో శ్రీ సత్యసాయి జిల్లా టాప్‌లో నిలవగా, దాని తర్వాతి స్థానం అన్నమయ్య జిల్లాదే. చిత్తూరు, తిరుపతి ఆ తర్వాతి వరసలో ఉన్నాయి. ఏతావాతా రాయలసీమలోనే అసైన్డ్ అక్రమాలు కోకొల్లలుగా చోటుచేసుకోవడం గమనార్హం. శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, నెల్లూరు జిల్లాల పరిధిలోని కొన్ని డివిజన్లు, మండలాల్లో కూడా అక్రమంగా భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. అయితే, పైన పేర్కొన్న టాప్ జిల్లాల్లో మాత్రం అతి భారీగా, లక్షల ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగించారు. పేదలకు మేలు చేస్తున్నామనే పేరుచెప్పి నాటి వైసీపీ ప్రభుత్వంలోని కొందరు పెద్దలు, నేతలు భూములను దండుకున్నారు. ఇందుకు నాటి ప్రభుత్వంలో జిల్లాల్లో కీలక పోస్టుల్లో సూపర్‌బాస్‌లుగా ఉన్న ఐఏఎస్ అధికారుల పాత్ర ఉందని తాజాగా నిర్ధారణ అయింది.ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ చట్టం(పీఓటీ) -1977, రిజిస్ట్రేషన్ చట్టం-1908, భూ ఆక్రమణ చట్టం-1905, చుక్కల భూముల చట్టం-2017లను అమలు చేయాల్సింది ఆ అధికారులే. అయితే, రాజకీయ నేతల ఒత్తిళ్లు, బెదిరింపులకు తలొగ్గి చట్టాల అమలును నీరుగార్చారని రెవెన్యూశాఖ తేల్చింది.

నిబంధనలకు నీళ్లు..

2023 సెప్టెంబరు నుంచి 2024 మార్చి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13,59,805 ఎకరాల భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. అయితే, ఇందులో 5, 74,306 ఎకరాలు పీఓటీ చట్టానికి విరుద్ధంగా, జీవో 596ను ఉల్లంఘించి నిషేధ విముక్తి కల్పించారని రెవెన్యూ విచారణలో తేలింది. ఇందులో 2.64 లక్షల ఎకరాలకు అసలు రెవెన్యూ రికార్డులే లేవు. అయినా ఆ భూములను అసైన్డ్ కోటా కింద లెక్కేసి ఫ్రీ హోల్డ్ చేశారని విచారణలో బయటపడింది. కలెక్టర్ల ఉత్తర్వులు లేకుండానే 60వేల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు. అంటే ఈ విషయం కలెక్టర్‌లకు తెలిసే జరిగిందా? లేదా? 36వేల ఎకరాలను విస్తీర్ణంతో సంబంధం లేకుండా 22(ఏ) నుంచి తొలగించారు. చట్టంలోని ప్రధాన అంశం 20 ఏళ్లు పూర్తయిన భూములకే ఫ్రీ హోల్డ్ కల్పించాలని. కానీ, రాష్ట్ర వ్యాప్తంగా 38వేల ఎకరాలను, ఆ కండీషన్ పరిధిలో లేకున్నా నిషేధ జాబితా నుంచి తొలగించారని తాజా నివేదికలో రెవెన్యూశాఖ పేర్కొంది. అంటే, ఇవన్నీ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు దగ్గరుండి పర్యవేక్షించడంతోపాటు, పరిశీలించాల్సిన అంశాలు. కలెక్టర్ ఉత్తర్వులు లేకుండా 60వేల ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగిస్తుంటే వారు జిల్లాల్లో ఏం చేసినట్లు? అన్న అనుమానలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూశాఖ నివేదిక ప్రకారం 13 జిల్లాల్లో భారీగా అక్రమాలు జరిగాయి. అందులో 4 జిల్లాల్లో శ్రుతి మించేశారు. సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అధికారులు కళ్లు మూసుకున్నారా? వైసీపీ నేతలకు రాసిచ్చేశారా? అన్నట్లుగా అక్రమాలున్నాయి.

జిల్లా	ఫ్రీ హోల్డ్ చేసిన భూమి (ఎకరాల్లో)	అక్రమంగా చేసినవి
శ్రీసత్యసాయి	2,57,042	1,30,215
అన్నమయ్య	1,26,227	64,218
తిరుపతి	69,011	34,202
చిత్తూరు	1,59,327	18,690

కలెక్టర్లది బాధ్యత కాదా?

ఫ్రీ హోల్డ్ చేసే ప్రతి అసైన్డ్ భూమికీ రికార్డు పక్కాగా ఉండాలి. భూమి పొందిన లబ్ధిదారు(అసైనీ) పొజిషన్‌లో ఉండాలి. ఆ భూమి 20 ఏళ్ల క్రితమే అసైన్‌మెంట్ చేసి ఉంటే చట్టప్రకారం ఫ్రీ హోల్డ్‌కు అర్హత ఉన్నట్లు. నిషేధ భూముల జాబితా 22 (ఏ) అమలు, పర్యవేక్షణ బాధ్యతలు జిల్లాలో ఐఏఎస్‌లకే ఉన్నాయి. దీనిపై రెవెన్యూశాఖ 2023 డిసెంబరులో జీవో 596 జారీ చేసింది. అందులోనూ జిల్లా స్థాయిలో కీలక పోస్టుల్లో ఉన్న ఐఏఎస్‌లకే అధికారాలు కట్టబెట్టారు. నిజానికి, జిల్లా స్థాయిలో భూముల అంశంలో కలెక్టర్ అంటే జేసీనే. భూములను ఫ్రీ హోల్డ్ చేయడంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పర్యవేక్షించుకోవాల్సిన బాధ్యత వారిదే. కానీ తాజా రెవెన్యూ విచారణలో 2.64 లక్షల ఎకరాల భూమికి రికార్డులు లేకున్నా ఫ్రీ హోల్డ్ చేశారు.

ఎవరేమనుకుంటే మాకేంటి?

ఏసీబీ కేసు ఉన్న అధికారికే విజిలెన్స్
రెవెన్యూశాఖలో సరికొత్త వివాదం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"రెవెన్యూశాఖ ఇంకా కంట్రోల్‌లోకి రాలేదు. ఇలాగైతే కష్టం" సీఎం చంద్రబాబు ఇటీవలి కలెక్టర్ల సమావేశంలో చేసిన వ్యాఖ్యలివి. ఈ శాఖను దారిలో పెట్టి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని సీఎం తపనపడుతుంటే, రెవెన్యూ అధికారులు మాత్రం తమదారి తమదే అని నిరూపించుకున్నారు. ఏసీబీ కేసులో ప్రాసిక్యూషన్ ఎదుర్కోవాలని ఓ అధికారిపై ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంటే, ఆ అధికారికే ఏరికోరి సీసీఎల్ఏ(భూపరిపాలన ప్రధాన కమిషనర్) కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ విషయం తెలిసి ఉన్నతాధికారులు విస్తుపోతున్నారు. భారీగా డబ్బు దొరికిన కేసులో ఏసీబీ విచారణను ఎదుర్కోవాల్సిన అధికారికి విజిలెన్స్ విభాగం ఎలా ఇచ్చారు? అన్న చర్చతో ఈ వ్యవహారం వివాదస్పదంగా మారింది. ఏసీబీ కేసులు ఉన్నవారికి భరోసా ఇచ్చేలా పోస్టింగ్ ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల లక్షమందికిపైగా ఆదివాసీలు నిర్వాసితులవుతున్నారు. వారికి పునరావాసం, పరిహారాలను అందించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక విభాగం ఏర్పాటుచేసింది. ఇందులో ఓ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమించారు. 2017లో పోలవరం ఎస్‌డీసీ కార్యాలయంలో భారీగా నగదు పంపిణీ జరుగుతోందన్న ఫిర్యాదుపై ఏసీబీ అధికారులు దాడిచేశారు. ఆ సమయంలో సోదాలు జరపగా ఓ డిప్యూటీ కలెక్టర్ స్థాయి కీలక అధికారి వద్ద భారీగా నగదు లభ్యమైంది. దీంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. జవాబుదారీ కాని సొమ్ము దొరికిందని కేసు డైరీలో పేర్కొన్నారు. ఈ కేసుపై విచారణలో భాగంగా ఆ అధికారిపై నమోదైన ఆరోపణలపై కోర్టులో విచారించేందుకు(లీగల్ ప్రాసిక్యూషన్) అనుమతించాలని ఏసీబీ కోరింది. గత ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా విషయాన్ని నాన్చగా, కొత్త ప్రభుత్వం ఇటీవలే ఇందుకు అనుమతించింది. ఇది జరిగిన కొద్దిరోజులకే ఆ అధికారికి సీసీఎల్ఏలో పోస్టింగ్ ఇచ్చారు. అదీ చాలా కీలకమైన పోస్టింగ్. సీసీఎల్ఏ కార్యాలయంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, ఇతర ఉద్యోగుల విజిలెన్స్ కేసులు, సర్వీసు అంశాలు చూసే విభాగం ఆ అధికారికి అప్పగించారు. ఆ అధికారి గురించి గతంలో పనిచేసిన జిల్లా కలెక్టర్, జేసీతో మాట్లాడిన తర్వాతే ఈ పోస్టింగ్ ఇచ్చినట్లు రెవెన్యూశాఖ సమర్థించుకుంటోంది. కానీ, ఆయనకు ఏరికోరి విజిలెన్స్ విభాగం ఎందుకు ఇచ్చారన్న దానికి సమాధానం లేదు. ఏసీబీ కేసులో ప్రాసిక్యూషన్ ఎదుర్కొనే అధికారి, తన కింది కేడర్ అయిన తహసీల్దార్, డీటీల విజిలెన్స్ కేసుల్లో పారదర్శకంగా ఎలా ఉంటారు? ఈ విషయం గురించి 'ఆంధ్రజ్యోతి' ఆరా తీయగా, ఓ ఉన్నతాధికారి కావాలనే పోస్టింగ్ ఇప్పించారనే విషయం వెలుగుచూసింది.

మొక్కు తీర్చుకోడానికి వెళ్తూ..

» లారీని ఢీకొన్న కారు.. ఒకే కుటుంబంలోని నలుగురి దుర్మరణం

» అవనిగడ్డ సమీపంలో ప్రమాదం... నిద్రమత్తే కారణమా?!



లారీని ఢీకొట్టిన కారు

అవనిగడ్డ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కొడుకు పుట్టాడన్న సంతోషంలో దేవుడికి మొక్కు తీర్చుకునేందుకు కారులో వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఐటీసీ ఉద్యోగి.. తన ఇద్దరు బిడ్డలతోపాటు తల్లిదండ్రులనూ కోల్పోయారు. కృష్ణా జిల్లా పులిగడ్డ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టడంతో ఈ ఘోరం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గిడుగు సందీప్ హైదరాబాద్‌లోని ఐటీసీ కంపెనీలో పని చేస్తున్నారు. ఇటీవల కుమారుడు పుట్టడంతో కుటుంబ సమేతంగా, మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తెనాలి నుంచి సోమవారం కారులో బయలుదేరారు. సాయంత్రం 3 గంటల సమయంలో మోపిదేవి మార్గంలోని పులిగడ్డ-పెనుమూడి వారధి, టోల్‌గేట్ నడుమ ఎదురుగా వస్తున్న లారీని కారు వేగంగా వెళ్లి ఢీకొంది. రహదారిపై ఎడమవైపుగా వెళ్లాల్సిన కారు, కుడి వైపునకు వెళ్లి ఎదురుగా లారీపైకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారును సందీప్ డ్రైవ్ చేస్తుండగా, ముందు సీటులో ఉన్న ఆయన తండ్రి జీఆర్ మోహన్‌బాబు (60), వెనుక కూర్చున్న తల్లి అరుణ (55) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక సీటులో సందీప్ భార్య పల్లవి, కుమార్తె సాత్విక (5)తో పాటు పల్లవి ఒడిలో రెండు నెలల షణ్ముఖ్ కూడా ఉన్నాడు. తీవ్రంగా గాయపడిన సాత్వికను అవనిగడ్డ నుంచి మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందింది. సందీప్‌కు తీవ్ర గాయాలు కాగా, ఆయన భార్య పల్లవి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో సందీప్ షాక్‌లోకి వెళ్లాడు. కొద్దిసేపు తానెవరో చెప్పలేకపోయిన ఆయన, ఆ తర్వాత తెనాలి నుంచి వచ్చినట్లుగా పోలీసులకు వివరించారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు అంతబట్టడంలేదని, బహుశా సందీప్ నిద్రమత్తులో ఉండడంవల్ల జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

మైనర్ మినరల్స్ నిబంధనల్లో జోక్యం చేసుకోలేం

» జీవోలను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలు కొట్టివేసిన హైకోర్టు

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనర్ మినరల్స్ లీజు కేటాయింపునకు ఆక్షన్ విధానంతో పాటు వార్షిక డెడ్ రెంట్ చెల్లింపు, సెక్యూరిటీ డిపాజిట్ నిబంధనలకు సవరణ చేస్తూ 2022లో గనులశాఖ తీసుకొచ్చిన జీవో 13, 14లను సవాల్ చేసిన వ్యాజ్యాలను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. సెక్యూరిటీ డిపాజిట్‌గా ఎంత సొమ్ము జమ చేయాలన్నది కోర్టు నిర్ణయించడం సరికాదని పేర్కొంది. అది పూర్తిగా విధానపరమైన నిర్ణయమని తెలిపింది. వార్షిక డెడ్ రెంట్‌కు మూడింతలు నగదు రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చేయాలన్న నిబంధన ఏకపక్షమైనదిగా ప్రకటించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. సవరించిన మైనర్ మినరల్స్ నిబంధనలను అధికారులు దుర్వినియోగం చేస్తున్నారనే కారణంతో చట్టబద్ధత కలిగిన ఆ నిబంధనలు రద్దు చేయలేమంది. ఈ విషయంలో పిటిషనర్లు నిర్దిష్ట ఉదాహరణలు కోర్టు ముందు ఉంచలేదని పేర్కొంది. పలు మైనింగ్ సంస్థలు, లీజుదారులు వేసిన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. లీజు కేటాయింపునకు ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానాన్ని అనుసరించకుండా ఆక్షన్ ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఫెడరేషన్ ఆఫ్ మైనర్ మినరల్స్ ఇండస్ట్రీ, పలువురు మైనింగ్ లీజుదారులు తమ పిటిషన్లలో తప్పుపట్టారు. మూడేళ్ల డెడ్‌రెంట్‌కు సమానమైన సొమ్మును సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలన్న నిబంధనను చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల తుది విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం పిటిషన్లను కొట్టివేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.